RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY  తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 170 ISSUE NO : 170 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | శనివారం,డిసెంబర్,27,2025 Saturday,December,27,2025 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /-



## స్వర్గీయ మన్మోహన్‌సింగ్‌కు సీయం రేవంత్,డిప్యూటీ సీయం భట్టి నివాళులు

**హైదరాబాద్, డిసెంబర్ 26,తెలంగాణ దిశ :** మాజీ ప్రధాని, ప్రఖ్యాత ఆర్థిక వేత్త స్వర్గీయ డాక్టర్ మన్మోహన్ సింగ్ గారి వర్ధంతి సందర్భంగా ఇవాళ జూబ్లీ హిల్స్ నివాసంలో ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీఎంసలహాదారు వేం నరేందర్ రెడ్డి,శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేం దర్ రెడ్డి,నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి గారు మాట్లాడుతూ, డాక్టర్ మన్మోహన్ సింగ్ గొప్ప రాజనీతిజ్ఞుడిగా, నవ భారత శిల్పిగా దేశానికి అపార సేవలు అందించారని పేర్కొన్నారు. నిజాయితీ, దూరదృష్టి, మానవతావాదంతో దేశాభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. ముఖ్యంగా ఆర్థిక రంగంలో చేపట్టిన సంస్కరణలు దేశ ప్రగతికి బలమైన పునాది వేశాయని తెలిపారు.

## చివరి దశకు మేడారం గుడి పునర్నిర్మాణ పనులు

**వరంగల్, డిసెంబర్ 26,తెలంగాణ దిశ :** 2026: ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగగా ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర ప్రాంగణం సరికొత్త రూపు సంతరించుకుంటోంది. తెలంగాణ కుంభమేళాగా పిలవబడే ఈ వనదేవతల జాతర కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభివృద్ధి పనులు ప్రస్తుతం తుది దశకు చేరుకున్నాయి. సుమారు 25.5 కోట్ల రూపాయల భారీ నిధులతో రూపొందించిన మాస్టర్ ప్లాన్ పనులను అధికారులు అత్యంత వేగంగా పూర్తి చేస్తున్నారు.



## సాహస బాలలకు బాల పురస్కార్

# అవార్డులు

### అవార్డులను అందచేసిన రాష్ట్రపతి ముర్ము




న్యూఢిల్లీ,డిసెంబర్ 26 : న్యూఢిల్లీ వేదికగా 'ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్' కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఢిల్లీలో నిర్వహించిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చిన్నారులకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ పురస్కారాలు ధైర్య సాహసాలు, కళలు, సంస్కృతి, పర్యావరణం, ఇన్నోవేషన్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ, క్రీడలు అనే ఆరు విభాగాల్లో సృజనాత్మకత చూపించిన వారికి అందించారు. అవార్డు గెలుచుకున్న పిల్లలు, వారి తల్లిదండ్రులకు రాష్ట్రపతి అభినందనలు తెలిపారు.



## టొరంటోలో హత్యకు గురైన..

# భారతీయ విద్యార్థి

టొరంటోలో : టొరంటో స్కార్‌బరో యూనివర్శిటీ ప్రాంగణం సమీపంలో 20ఏళ్ల భారతీయ డాక్టరేట్ విద్యార్థి హత్యకు గురైనట్లు అధికారులు శుక్రవారం తెలిపారు. విద్యార్థిపై మంగళవారం కాల్పులు జరిగాయని, బాధితుడిని శివంక్ అవస్థిగా టొరంటో పోలీసులు గుర్తించారని అన్నారు. ఈ కేసును హత్యగా దర్యాప్తు చేస్తున్నామని అన్నారు. నిందితుడు పరారీలో ఉన్నాడని, అతని గురించి వివరాలు అందించాల్సిందిగా స్థానికులను కోరినట్లు తెలిపారు. ఈ ఏడాదిలో టొరంటోలో ఇది 41వ హత్య కేసుగా పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటలకు హైలాండ్ క్రీక్ ట్రైల్ మరియు ఓల్డ్ కింగ్‌స్టన్ రోడ్ ప్రాంతంలో ఒక వ్యక్తి గాయాలతో నేలపై పడి ఉన్నాడని సమాచారం అందినట్లు ఇన్‌స్పెక్టర్ జెఫ్ అల్లింగ్టన్ పేర్కొన్నారు.



## ఢిల్లీ కాలుష్యంపై సుప్రీం చీఫ్ జస్టిస్

# ఆందోళన

### పర్యావరణవేత్తలే పరిష్కారం కనుగొనాలి

న్యూఢిల్లీ, డిసెంబర్ 26 : దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం రోజురోజుకూ పెరుగుతోంది. శుక్రవారం ఉదయం కూడా గాలి నాణ్యత సూచిక ప్రమాదకర స్థాయిలో నమోదైంది. అనేక ప్రాంతాల్లో ఏక్యూఐ లెవెల్స్ 400కిపైగా నమోదయ్యాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



## మా అయ్య మొగోడు..

# తెలంగాణ తెచ్చిన మొనగాడు

- మా అయ్య పేరు బరాబర్ చెప్పుకుంటా
- రేవంత్ రెడ్డి చిట్టినాయుడు కాదు.. భీమవరం బుల్లోడు
- దమ్ముంటే ఇంగ్లీష్, హిందీ, ఉర్దూ నేర్చుకో
- ఢిల్లీకి సంచులు మోసి పదవి కాపాడుకోవడం కాదు
- ఇచ్చిన హామీలను అమలు చేసి చూపాలి
- బిఆర్ఎస్‌లో ఉంటే ఆరికెపూడి ఎక్కడికి పోయినట్లు
- సిఎం రేవంత్‌కు కెటిఆర్ సవాల్

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**కేసీఆర్ ఒక్క ప్రెస్‌మీట్‌కు సీఎం రేవంత్ రెడ్డికి ముచ్చెమటలు పట్టాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇక కేసీఆర్ అసెంబ్లీకి వస్తే రేవంత్ రెడ్డి గుండె ఆగి చస్తాడని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లోని శేరిలింగంపల్లి నియోజకవర్గం అల్విన్ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు దోసల అనిల్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. తెలంగాణ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో కేటీఆర్ ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరస్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మా అయ్య మొగోడు.. తెలంగాణ తెచ్చిన మొనగాడు అని కేటీఆర్ అన్నారు. మా అయ్య పేరు బరాబర్ చెప్పుకుంటానని స్పష్టం చేశారు. నీ లెక్క సంచులు మోసుకుంటే నీ పిల్లలు చెప్పుకోరు అని విమర్శించారు. రేవంత్ రెడ్డిని కొడంగల్‌లో ఎమ్మెల్యేగా గెలవకుండా చేసే బాధ్యత మాది అని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి భాషను చూస్తే పిల్లలు నేర్చుకునే పరిస్థితి ఉందని అన్నారు. నేను గుంటూరులో చదువుకుంటే నీకేం బాధరా అని ప్రశ్నించారు. నేను హిందీ, ఉర్దూ, ఇంగ్లీష్ భాష నేర్చుకున్నా.... నువ్వు కూడా నేర్చుకో అని అన్నారు. నేను గుంటూరులో ఇంటర్ చదువుకున్నా.. నీ అల్లుడు ఆంధ్రోడే కదా అని ప్రశ్నించారు.



## వేయిస్తంభాల దేవాలయం అద్భుతమైన

# శిల్పకళ

### హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి

**హనుమకొండ,తెలంగాణ దిశ :** చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరస్వామి దేవాలయాన్ని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వారి సతీ మణి బంధువులతో కలిసి సందర్శి ంచారు. వారికి ఆలయమర్యాదల తో స్వాగతం పలికి ఉత్తిష్టగణపతికి దర్శనం అనంతరం రుద్రేశ్వరస్వా మికి వారి గోత్రనామాలులతో లఘు రుద్రాభిషేకం నిర్వర్తింపజేసి ఆలయ నాట్యమండపంలో ఆలయ కార్యనిర్వహణాధికారి డి.అనిల్ కుమార్ తీర్థప్రసాదాలు, శేషవస్త్ర లు అందజేశారు. వేదఆశీర్వచనం నిర్వర్తించి ఆలయప్రాశిస్తాన్ని ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేందర్‌శర్మ వారికి వివరించారు. సూర్య, విష్ణు ఆలయాల చరిత్ర నాట్యమండపం, స్తంభాలపై వెంట్రుక పట్టే అటువంటి రంధ్రాలు, జిట్టెడు ఆంజనేయస్వామి, తలకిందులచాప తలకిందుల మనిషి, అష్టదిక్పాలకులు గాయత్రి మాత, కళ్యాణమండపం విశేషాలను వారికి వివరించారు. వారు అద్భుతమైన శిల్పకళా అని తెలంగాణ రాష్ర్టంలో ఉండడం మనకు గర్వకారణమన్నారు. కాకతీయులు భారత సంస్కృతిని సాంప్రదాయాన్ని ప్రతిబింబించేవిధంగా అద్భుత శిల్పకలని అందించారని ఆయన పేర్కొన్నారు. వారసత్వ సంపదలను సమాజం కాపాడుకోవాలన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేందర్‌శర్మ, సందీప్‌శర్మ, మణికంఠశర్మ ఆధ్వ ర్యంలో వైదిక కార్యక్రమాలను నిర్వర్తించారు. వారికి ఆలయ సిబ్బంది మధుకర్, రజిత, రామ కృష్ణ సేవలందించారు. సెలవుది నం కావడంతో వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించు కోవడానికి వచ్చారు.

## కేసీఆర్‌లో

# గుబులు మొదలైంది



### - మంత్రులు పొన్నం,గడ్డం వివేక్

**గజ్వేల్,తెలంగాణ దిశ ::** గజ్వేల్ నియోజకవర్గంలో తొంబై కి పైగా అభ్యర్థులు కాంగ్రెస్ బలపర్చిన వారు గెలుపొందడంతో కేసీఆర్ గుండెల్లో గుబులు మొదలైందని మంత్రులు పొన్నం ప్రభాకర్, గడ్డం వివేక్ వెంకటస్వామిలు విమర్శించారు. సర్పంచులు సూచించిన ఐదు ప్రధాన సమస్యలపై మంత్రులుగా తామిద్దరం చొరవ చూపుతామని, గ్రామాల్లోని అన్ని సమస్యలను పరిష్కరించుకుందామని చెప్పారు. అనంతరం జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్ వెంకట స్వామి మాట్లాడుతూ గజ్వేల్‌లో కాంగ్రెస్ మద్దతుదారులుగజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ తరపున గెలుపొందిన సర్పంచ్ అభ్యర్థులకు శుక్రవారం సిద్ధిపేట కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో మంత్రులు గడ్డం వివేక్ వెంకట స్వామి, పొన్నం ప్రభాకర్ లు పాల్గొన్నారు. ఈ సందరరేగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. నూతనంగా గెలిచిన సర్పంచులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యకర్తల కష్టం, సంక్షేమ పథకాల ప్రభావంతోనే సర్పంచులు, వార్డు సభ్యులను గెలిపించుకున్నామని పేర్కొన్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లోనూ విజయమే లక్ష్యంగా అదేవిదంగా గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే కూర్చుండే వరకు ఈ జైత్ర యాత్ర కొనసాగాలని సూచించారు.

# అసంపూర్తి పనులను త్వరగా పూర్తి చేయాలి : జోనల్ కమిషనర్

**శేరిలింగంపల్లి, డిసెంబర్ 26,(తెలంగాణ దిశ ) :** అసంపూర్తి పనులను త్వరగా పూర్తి చేయాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ బోర?డే ఐఏఎస్ అధికారులకు సూచించారు. శుక్రవారం తన కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో అన్ని సర్కిళ్ల ఉప కమిషనర్లు, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లు తదితర అధికారులతో కలిసి శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలు, చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హేమంత్ బోర?డే మాట్లాడుతూ అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని, సమిష్టి కృషితో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలు, చేపట్టవలసిన పలు అభివృద్ధి పనుల పై



చర్చించారు. పెండింగ్ లో ఉన్న పనులు త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చారు, అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల మౌలిక వసతులు ఏర్పాటుకు కృషి చేయాలని ఆయన కోరారు.

# మల్లాపూర్ పఠాన్ బస్తీలో పర్యటన

## - డ్రైనేజీ పనుల పరిశీలన : నెమలి అనిల్ కుమార్





**మల్లాపూర్, డిసెంబర్ 26, (తెలంగాణ దిశ) :**బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా ఈరోజు ఉదయం మల్లాపూర్ లోని పఠాన్ బస్తీలో కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ పర్యటించారు. నూతనంగా మంజూరైన డ్రైనేజీ పనులను, మంచి నీటి సరఫరాను పరిశీలించారు. బస్తీ బాటలో వెలువడిన మిగతా పనులను కూడా కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి సహకారంతో అతి త్వరలో పూర్తిచేస్తామని బస్తీ వాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మల్లాపూర్ ప్రధాన కార్యదర్శి తాండ్ర శ్రీకాంత్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి వుండం శ్రీనివాస్, సీనియర్ నాయకులు కోయలకొండ రాజేష్, సురేష్ గౌడ్, అన్వర్, ఇబ్రహీం, మహిళా నాయకురాళ్లు ఇష్రాత్ బనో, ఇంతియాజ్ బేగం, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలి..

## - ఉప్పల్ జోనల్ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన రాధికా గుప్త

**ఉప్పల్, డిసెంబర్ 26, (తెలంగాణ దిశ) :**ఉప్పల్ జోనల్ కమిషనర్ గా మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) రాధికా గుప్తా బాధ్యతలు స్వీకరించారు. ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన జోనల్ కార్యాలయంలో గురువారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్, కాప్రా, బోడుప్పల్, నాచారం, ఘట్కేసర్, నాగారం సర్కిళ్లకు చెందిన డిప్యూటీ కమిషనర్లు, ఇతర అధికారులు, సిబ్బంది హాజరై ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం రాధికా గుప్తా మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో పారదర్శకత, వేగం ఉండేలా చర్యలు



తీసుకుంటామని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఉప్పల్ జోనల్ పరిధిలోమౌలిక వసతుల అభివృద్ధి, పారిశుధ్యం, రోడ్లు, డ్రైనేజీ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఆమె తెలిపారు.

# కొనసాగుతున్న ఇండిగో సంక్షోభం!




న్యూఢిల్లీ: ఇండిగో విమాన సర్వీసుల్లో ఏర్పడిన అంత రాయం కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో కేంద్ర పౌర విమానయా న మంత్రిత్వ శాఖ రంగంలోకి దిగింది. దేశవ్యాప్తంగా విమానాశ్ర యాల కార్యకలాపాలపై 24 గంటల సమీక్షను ప్రారంభించినట్లు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు.క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేసి, ప్రయాణికుల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ఉన్నతాధికారులను ప్రధాన విమానాశ్రయాలకు పంపినట్లు ఆయన వెల్లడించారు. ఈ విషయంపై రామ్మోహన్ నాయుడు 'ఎక్స్' వేదికగా ప్రకటన చేశారు. ఇండిగో కార్యకలాపాల్లో సమస్యలు మొదలైనప్పటి నుంచి పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, డీజీసీఏ పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నాయి," అని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత పరిణామాలను "అసాధారణ పరిస్థితి"గా అభివరి?ంచిన ఆయన, ఉన్నతస్థాయిలో తక్షణ జోక్యం అవసరమని స్పష్టం చేశారు. ఇటీవల తమ మంత్రిత్వ శాఖ, డీజీసీఏ ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న ఎయిర్‌పోర్టులకు వెళ్లి తనిఖీలు చేయాలని, ప్రయాణికులతో మాట్లాడి వారి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని, ఎయిర్‌లైన్ సిబ్బంది సేవలపై ఆరా తీయాలని సూచించారు. ప్రయాణికుల నుంచి వచ్చిన ఫిర్యాదులను, గుర్తించిన లోపాలను వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు. దేశంలో అతిపెద్ద విమానయాన సంస్థ అయిన ఇండిగో, గత కొన్ని రోజులుగా కార్యా చరణ సవాళ్లను ఎదుర్కొంటోంది. దీంతో ఢిల్లీ, ముంబై, బెంగళూ రు, హైదరాబాద్ వంటి ప్రధాన విమానాశ్రయాల్లో తీవ్ర అంతరా యాలు ఏర్పడుతున్నాయి. ప్రయాణికులు సోషల్ మీడియాలో భారీ క్యూలు, చెక్-ఇన్ ప్రక్రియలో జాప్యం, విమానాల సమాచారంపై స్పష్టత లేకపోవడం వంటి సమస్యలపై ఫిర్యాదులు చేస్తున్నారు. క్షేత్రస్థాయి నుంచి అధికారుల నివేదికలు అందిన తర్వాత, రానున్న 24 గంటల్లో మంత్రిత్వ శాఖ సమగ్ర మార్గదర్శకాలను జారీ చేసే అవకాశం ఉంది. దేశంలోనే అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో సంక్షోభంలో చిక్కుకుంది. సిబ్బంది కొరతతో సతమతం అవుతున్న ఇండిగో.. తీరుతో ప్రయాణికుల నుంచి ఆగ్రహం వ్యక్తం అవుతోంది. దేశవ్యాప్తంగా వందల సంఖ్యలో ఇండిగో విమానాలు రద్దయ్యాయి.. అయితే.. కొన్ని విమానాలు మాత్రం ఆలస్యంగా నడుస్తున్నాయి.. ఢిల్లీ, ముంబై, హైదరాబాద్, బెంగళూరు గోవా, అహ్మదాబాద్‌లో సర్వీసులు రద్దయ్యాయి.. సాంకేతికలోపం, సిబ్బంది కొరతతో విమానసేవల్లో సమస్యలు మొదలయ్యాయి.. ఈ క్రమంలో ఇండిగో ఫ్లైట్స్ క్యాన్సిలేషన్స్ ఎఫెక్ట్ పెళ్లిళ్లు, శుభకార్యాలపై కూడా పడుతోంది.. ఓచోట కొత్త జంట వాళ్ల రిసెప్షన్‌కి వాళ్లే వెళ్లలేకపోతే.. మరోచోట పెళ్లికొడుకు ఎయిర్‌పోర్ట్‌లో ఇరుక్కుపోయాడు.. ఈ వారం ఇండిగో విమానాల రద్దు కారణంగా వేలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు, అయితే ఈ అంతరాయం ముఖ్యంగా వధూవరులను తీవ్రంగా దెబ్బతీసింది. ఒక జంట వీడియో కాల్ ద్వారా తమ వివాహ రిసెప్షన్‌కు జరుపుకుంటే.. మరికొందరు వివాహ వేడుకలను రద్దు చేసుకోడానికి రెడీ అయ్యారు. కొందరైతే పెళ్లి వాయిదా వేయడం ఇష్టం లేక ఖరీదైన చార్టర్ ఫ్లైట్‌ను బుక్ చేసుకోవడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో ఓ యువకుడు తన వెడ్డింగ్ కార్డును చూపిస్తూ..ఎయిర్‌లైన్స్ సమస్య కారణంగా నా పెళ్లికి నేను హాజరుకాలేకపోతున్నాను అంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ వీడియోను తన ఎక్స్ ఖాతాలో షేర్ చేస్తూ..ఇది నా స్వంత పెళ్లి.. కానీ నేను వెళ్లలేకపోతున్నాను.

# రాష్ట్ర అభివృద్ధికి పెద్ద ఊతం

**హైదరాబాద్,తెలంగాణ దిశ:** తెలంగాణ ప్రభుత్వం ఫ్యూచర్ సిటీలో ప్రతిష్ఠాత్మకంగా వివిధ కంపెనీలు తమ పెట్టుబడుల ను ప్రకటించాయి. ఈ మేరకు సిఎం రేవంత్ సమక్షంలో పలు ఒప్పందాలు సాగాయి. రాష్ట్రంలో పెట్టు బడులు పెట్టేందుకు దేశ, విదేశాలకు చెందిన వివిధ కంపెనీలు ఆసక్తి చూపిస్తున్నాయి. వివిధ కంపెనీల ప్రతినిధులతో వరుస సమావేశాలతో సీఎం రేవం త్‌రెడ్డి బిజీ బిజీగా ఉన్నారు. ఆయన సమక్షంలో పలు కంపెనీలు ఎంవోయూలు కుదుర్చుకు ంటున్నాయి. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డితో గోద్రెజ్ జెర్సీ సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ ఫిరోజ్ షా గోద్రెజ్, గ్రూప్ ప్రెసిడెంట్ రాకేశ్ స్వామి సమావేశమ య్యారు. హైదరాబాద్‌లో తమ సంస్థ విస్తరణపై ఫిరోజ్‌షా గోద్రెజ్ సీఎంతో చర్చించారు. పాలు, ఎఫ్‌ఎంసీజీ, రియల్‌ఎస్టేట్, ఆయిల్‌పామ్ విభాగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఆ సంస్థ ఆసక్తి కనబరిచింది. మరోవైపు సుమధుర గ్రూప్, టీసీసీఐ తైవాన్ గ్రూప్ తెలంగాణ ప్రభుత్వంతో ఎంవోయూలు కుదుర్చుకున్నాయి. రాష్ట్రం రూ.1000 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ సంస్థ ముందుకొచ్చింది. కాంట్రాక్ట్ రీసెర్చ్, డెవలప్‌మెంట్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ ఆర్గనైజేషన్ (సీఆర్‌డీఎంవో) నిర్మాణానికి రూ.వెయ్యి కోట్లు పెట్టుబ డిపెట్టనుంది. వచ్చే నాలుగేళ్లలో 200 మందికిపైగా ఉద్యోగాలుకల్పించనుంది. ఈ మేరకు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్‌డీ సెంటర్ కోసం ఫెర్టిస్ ఇండియాతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. రెండు దశల్లో ఫెర్టిస్ ఇండియా రూ.2 వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది. మరోవైపు ఫుడ్ అండ్ బేవరేజెస్ యూనిట్-2 విస్తరణకు కేజేఎస్ ఇండియా ఒప్పందం కుదుర్చుకుంది. ఫ్రీజ్- డ్రైడ్ కాఫీ ఎలాంట్ నిర్మాణానికి వింటేజ్ కాఫీ అండ్ బేవరేజెస్ ఒప్పందం కుదుర్చుంది. ఫుడ్ అండ్ ఎఫ్‌ఎంసీజీ తయారీ యూనిట్‌కు ఆర్‌సీపీఎల్, ఎలక్ట్రానిక్స్ కాంట్రాక్ట్ మ్యానుఫాక్చరింగ్ సేవల విస్తరణకు కైన్స్ టెక్నాలజీ ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. రూ.9 వేల కోట్ల పెట్టుబడి పెట్టేందుకు జేసీకే ఇన్‌ఫ్రా, మూడు దశల్లో రూ.2,500 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ఆర్‌సీటీ ఎనర్జీ ఇండియా, 50 మెగావాట్ల క్లీన్ ఎనర్జీ డేటా సెంటర్‌కు అక్వెలోన్ నెక్సస్, హైపర్‌స్కేల్ డేటా సెంటర్ క్యాంపస్ ఏర్పాటుకు ఏజీపీ గ్రూప్ ఒప్పందం కుదుర్చుకున్నాయి. రూ.70 వేల కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్లు ఏఐ-రెడీ డేటా పార్క్ ప్రకటించింది. రూ.2 వేల కోట్ల పెట్టుబడి పెట్టనున్న అరబిందో ఫార్మా, పెప్టైడ్స్ తయారీ అండ్ ఆంకాలజీ సీడీఎంవో యూనిట్ పెట్టనున్న గ్రాన్యుల్స్ ఇండియా పెట్టుబడులకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించాయి. ఫ్యూచర్ సిటీలో జరుగుతున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ రెండో రోజు.. రాష్ట్రానికి పెట్టుబడుల వరద పారింది.. బ్యాక్‌టు బ్యాక్ మీటింగ్‌లు, వరుసగా మౌ సంతకాలతో రాష్ట్రాన్ని పెట్టుబడుల హబ్‌గా తీర్చిదిద్దేందుకు సీఎం రేవంత్ రెడ్డి పలు కంపెనీలతో చర్చలు జరిపారు. రెండో రోజు మొత్తం రూ.1,11,395కోట్ల పెట్టుబడులు తెలంగాణకు రావడం రాష్ట్ర అభివృద్ధికి పెద్దఊతం కానుంది. ఈ పెట్టుబడులతో కొత్త సంస్థలు.. భారీ స్థాయిలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కూడా రాబోతున్నాయి.. అయితే, పెట్టుబడుల సంఖ్య మరింత పెరగనుంది..

# రెవెన్యూ సేవలను మరింత సులభతరం!

**అమరావతి,తెలంగాణ దిశ :** రెవెన్యూ సేవలను మరింత సులభతరం చేయాలని ఆ శాఖ ఉన్నతాధి కారులను సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రియల్‌టైమ్‌లో పట్టాదారు పాస్ పుస్తకాలు ఆటో మ్యుటేషన్ జరగాలని ఆయన పేర్కొన్నారు. 2027 డిసెంబర్ నాటికి భూముల రీసర్వే పూర్తి కావాలని ఆయన ఉన్నతాధికారులకు స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌తోపాటు ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. పట్టాదారు పాస్ పుస్తకం కోసం భూయజమానులు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదని ఈ సందర్భంగా వారికి సూచించారు.

రెవెన్యూ శాఖలో ఏడాదిలోగా పూర్తి ప్రక్షాళన జరగాలని వారికి తెలిపారు. ప్రతి నెలా రెవెన్యూ శాఖపై సమీక్ష నిర్వహిస్తానని వారికి ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు.రాష్ట్రంలో జీరో ఎర్రర్ రెవెన్యూ వ్యవస్థ ఏర్పా టు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి అనగాని సత్యప్ర సాద్ తెలిపారు.

వెబ్ ల్యాండ్‌లో ఏ మార్పు జరిగినా అది ఆన్‌లైన్‌లో శాశ్వతంగా నిక్షిప్తం అయ్యేలా వ్యవస్థను రూపొందిస్తు న్నామని పేర్కొన్నారు.రెవెన్యూ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష అనంతరం మంత్రి అనగాని సత్య ప్రసాద్ విలేకర్లతో మాట్లాడుతూ.. గత పాలకులు చేసిన పాపాల వల్లే రెవెన్యూ సమస్యలు కొనసాగు తున్నాయని మండిపడ్డారు. ఏడాదిన్నరగా వైసీపీ ప్రభుత్వ పాపాలు కడిగేందుకు కృషి చేస్తున్నందు వల్లే ప్రజలకు పూర్తిస్థాయిలో న్యాయం చేయలేక పోయామని ఆవేదన వ్యక్తం చేశారు.

దోచుకునేందుకు గత పాలకులు అస్తవ్యస్తం చేసిన విధానాలు ఇప్పుడిప్పుడే ఒక కొలిక్కి వస్తున్నాయని పేర్కొన్నారు. 7,600 గ్రామాల్లో పకడ్బందీగా రీసర్వే పూర్తి చేశామని వివరించా రు. అవినీతి,అక్రమాలకు తావులేకుండా పాస్‌పోర్ట్ కార్యాలయాల తరహాలో రిజిస్ట్రేషన్ కార్యాలయాలు తీసుకురావాలని సీఎం చంద్రబాబు సూచించారన్నారు. జాయింట్ కలెక్టర్లు లేని జిల్లాలకు వెంటనే వారిని నియమించాలని సీఎం ఆదేశించారని చెప్పారు. 26 జిల్లాల్లోనూ రెవెన్యూ సమస్యలు పరిష్కారం కోసమే జేసీలు పని చేయాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారన్నారు. భూ సమస్యలన్నింటికీ ఇకపై జాయింట్ కలెక్టర్లదే బాధ్యత అని మంత్రి అనగాని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

'జీరో ఎర్రర్ రెవన్యూ వ్యవస్థ' ఏర్పాటు దిశగా ఏపీప్రభుత్వం కృషిచేస్తోందని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు.సచివాల యంలో రెవెన్యూశాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించి. కీలక సూచనలు చేసినట్లు తెలిపారు. స్టాంప్ రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా ఈ ఏడాది రూ.10,169 కోట్ల ఆదాయం ఆర్జించడమే లక్ష్యమని సీఎం చెప్పారని మంత్రి తెలిపారు. అవినీతి, అక్రమాలకు తావులేకుండా పాస్‌పోర్టు కార్యాల యాల తరహాలో రిజిస్ట్రేషన్ కార్యాలయాలు తీసుకురావాలని సీఎం ఆదేశించారన్నారు. వెబ్‌ల్యాండ్‌లో ఏమార్పు జరిగినా.. అది ఆన్‌లై న్‌లో శాశ్వతంగా నిక్షిప్తమయ్యే వ్యవస్థ తీసుకొస్తున్నట్లు తెలిపారు. గత పాలకులు చేసిన తప్పుల వల్లే రెవెన్యూ సమస్యలు కొనసాగుతు న్నాయని విమర్శించారు. 'గత పాలకులు చేసిన అస్తవ్యస్తవిధానాలు ఇప్పుడిప్పుడే ఓకొలిక్కి వస్తున్నాయి. మొత్తం7,600 గ్రామాల్లో పకడ్బందీగా రీసర్వే పూర్తి చేశాం.జేసీలు లేని జిల్లాలకు వెంటనే జేసీలను నియమించాలని సీఎంఆదేశించారు. 26 జిల్లాల్లోనూ రెవెన్యూ సమస్యలు పరిష్కారం కోసమే జేసీలు పనిచేయాలని సీఎం స్పష్టం చేశారు.

# నా కంఠంలో శ్వాస ఉన్నంత వరకు ప్రజల కోసమే పోరాటం చేస్తా

## -మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

**మంథని,తెలంగాణ దిశ :**ఆరవై ఏండ్ల మీ పాలనలో ఆకలి తీరలేదని...గౌరవంగా బతికే పరిస్థితుల రాలేదని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆరోపించారు. ఈసందర్భంగా పుట్ట మధు మాట్లాడుతూ మంత్రిగా దుద్దిళ్ల శ్రీధర్ బాబు రెండేళ్ల ప్రజాపాలనలో ఎంత అభివృద్ధి జరిగిందో అడవిసోమన్‌పల్లి వంతెనను చూస్తేనే అర్థం అవుతోందన్నారు. వంతెనకు ఒకవైపు సగం వరకు సున్నం వేసి మరోవైపు వేయకుండా వదిలేశారని అన్నారు. రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంలో మంత్రి సాధించిన ఘనకీర్తి ఇదేనని ఆయన ఎద్దేవా చేశారు. ఆనాడు పీవీ నర్సింహారావు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో వంతెన నిర్మించారని, ఈనాడు కనీసం వంతెనకు సున్నం వేయించలేని పరిస్థితిలో మంత్రి ఉన్నారని ఆయన విమర్శించారు. 40ఏండ్లు మీ కుటుంబానికి అత్యధికంగా ఉన్న ఎస్సీలు, బీసీలు, మైనార్టీలు అవకాశం ఇస్తే ఏం చేశారని విమర్శించారు. నియోజకవర్గంలో రెడ్డీలు, వెలమలు, వైశ్యులు అధికంగా ఉన్నారని, బ్రాహ్మణ కులం తక్కువగా ఉన్నా అధికారం ఇచ్చారని గుర్తు చేశారు. ఆనాడు పీవీ దగ్గర నుంచి మీరు సుమారు 60ఏండ్లు పాలించిన పుణ్యాన మా ఆకలి తీరలేదని, గౌరవంగా బతికే పరిస్థితులు రాలేదని, ఇల్లు, ఉద్యోగం వైద్యం సక్కగా లేదని వీటన్నింటి మీద దృష్టిపెట్టాలని చెప్పామని గుర్తు చేశారు. ఇప్పటి వరకు 24నెలల్లో 24పైసల పని చేయలేదని చెప్పడానికి అడవిసోమన్‌పల్లి బ్రిడ్జి సాక్ష్యంగా నిలుస్తుందన్నారు. కుర్చీ మీద, సంపాదించే సమయం మీద మీ కుటుంబానికి ఉన్న శ్రద్ధ నియోజకవర్గంలో ఉన్న 85శాతం బీసీ ఎస్సీ మైనార్టీలపై లేదన్నారు. సమాజాన్ని ఆకలితో ఉంచడానికి చూపంచే శ్రద్ధ సమాజాన్ని అభివృద్ధి చేయడంలో చూపించడం లేదన్నారు. మంత్రిగా రెండేళ్ల కాలంలో నియోజకవర్గంలో ఒక వంతెన కట్టినవా అని ప్రశ్నించారు. ఆనాడు పీవీ తర్వాత నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో తాను ఎమ్మెల్యే ఉన్న సమయంలో బ్రిడ్జిలు వంతెనలు , ప్రాజెక్టులు నిర్మించామని గుర్తు చేశారు. చెక్ డ్యాంలు నిర్మిస్తే వాటిని వృధా అన్నారని, కానీ ఈనాడు అవి ఎంత అద్భుతంగా కన్పిస్తున్నాయో గమనించాలన్నారు. ఎప్పుడు పైసలే గెవులవనే విషయాన్ని గుర్తుంచుకోవాలని ఆయన హితవు పలికారు. ప్రతిపక్షాలు



లేకుండా చేస్తామని, లీడర్లను కొనుగోలు చేస్తామని, ఎలాగైనా గెలుస్తామని అనుకోవడం మీ అమాయకత్వమన్నారు. మమ్మల్ని అంతం చేయడం, కేసుల పాలు చేసే ప్రయత్నాలు చేయడం కాదని, నా కంఠంలో శ్వాస ఉన్నంత వరకు ప్రజల కోసమే పోరాటం చేస్తామని, అధికారం ఉంటే సమాజం మేలు కోసం, ప్రతిపక్షంలో ఉంటే ప్రభుత్వంతో పాటు మీ మెడలు వంచి పని చేయించుకోడమేనని అన్నారు. మంచితనం ముసుగులో ఉండి ప్రజలను మోసం చేస్తున్న విషయాన్ని బహిర్గతం చేస్తామన్నారు. అడవిసోమన్‌పల్లి బ్రిడ్జి చూసి కాంగ్రెస్ పార్టీ, దుద్దిళ్ల కుటుంబం అవమానపడాలని ఆయన అన్నారు. హైదరాబాద్‌లో నాలుగు ఆఫీస్‌లు పెట్టి తమ్ముడితో భూములు, రియల్ దందా చేయిస్తున్నాడని ఆరోపించారు. వేల కోట్లుసంపాదిస్తున్న మంథని ఎమ్మెల్యే మంథని అభివృద్ధిపై శ్రద్ధ చూపడం లేదన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఇచ్చిన ఓటు విలువను చాటి చెప్పి ప్రజలను చైతన్యం చేస్తామని, ప్రజాక్షేత్రంలో దుద్దిళ్లను దోషిగా నిలబెడుతామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్ జక్కు శ్రీ హర్షిని,బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు జక్కు రాకేష్, తగరం శంకర్ లాల్, పూదరి సత్యనారాయణ,ఆరేపల్లి కుమార్ కాయితి సమ్మయ్య, మాచిడి రాజు గౌడ్, పుప్పాల తిరుపతి, పోలు కనకరాజు, ఎస్ కే యాకూబ్, ఆసిఫ్ ఖాన్, ఇర్ఫాన్, బోనాల నరేందర్ లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# రాజకీయ అపరిపక్వత..!

బిహార్ అసెంబ్లీ ఎన్నికలలో ప్రజలు ఇచ్చిన తీర్పులో విపక్షం పట్ల విముఖత ప్రతిబింబించింది. అధికార కూటమికి 202 సీట్లు లభించడం అన్నది లాలూ కుటుంబంతో పాటు, రాహుల్ తీరుపై అంటే కాంగ్రెస్‌పై ఉన్న వ్యతిరేకత స్పష్టంగా ప్రతిబింబించింది. ప్రతిపక్ష కూటమి మహాగఠ్ బంధన్‌కు కేవలం 35 సీట్లు మాత్రమే లభించం ఇందుకు ఉదాహరణగా చూడాలి. ఈ ప్రజాతీర్పును ప్రజలంతా అంగీకరించినా, రాహుల్ మాత్రం అంగీకరించడం లేదు. ఓట్ చోరీ మాయలో పడ్డ ఆయన మొత్తం ఎన్నికల తీరునే తప్పు పట్టారు. ప్రక్రియ మొత్తం తప్పుగా సాగిందన్నారు. బిహార్ ఎన్నికల వార్తలు, ఎన్నికల పరిణామాల విశ్లేషణలు, కథనాలు నివేదించడంలో మీడియా ఎప్పటికప్పుడు వివరిస్తున్నా రాహుల్ మాత్రం మాయలో న ఉంచి బయటపడడం లేదు. కులాభిమానాల ప్రాతిపదికన ప్రజలు ఓటు వేస్తారనడానికి లేదు. నితీశ్ కుమార్‌కు నష్టదాయకమయ్యేలా ప్రభుత్వ వ్యతిరేకత కనిపించలేదు. జన్ సురాజ్ నాయకుడు ప్రశాంత్ కిశోర్ ప్రయత్నాలు కూడా ఫలించలేదు. అయితే ఓటర్లు ఆయన్ను కొత్తగా రంగంలోకి వచ్చిన నాయకుడు గా మాత్రమే పరిగణించారు. రాహుల్‌గాంధీ ఎంతకూ ఓట్ చోరీ, నిరుద్యోగిత అంశాలకే పరిమితమయ్యారు. అంతే తప్ప సమస్యలు లేదా ప్రజల విషయాలను ప్రస్తావించడంలో కరాహుల్ విఫలం అయ్యారు. ఇరవై సంవత్సరాల నితీశ్ కుమార్ ప్రభుత్వ పాలనను కూడా గుర్తు చేసుకున్నారు. అయితే అనేక రంగాలలో నితీశ్ పాలనా తీరును కూడా ప్రజలు గుర్తు చేసుకున్నారు. అసెంబ్లీ ఎన్నికలలో బిహారీలు ఓటు వేసిన తీరుతెన్నులకు ఎవరూ సహేతుకమైన వివరణ ఇవ్వలేకపోతున్నారు. బిహార్ ప్రజలను ఒక ప్రత్యామ్నాయ దార్శనికతతో ఉత్తేజితులను చేయడంలోను, మార్పునకై ఒక ప్రగాఢ ఆకాంక్షను వారి మనసుల్లో నెలకొల్పడంలోనూ ప్రతిపక్ష రాజకీయ పార్టీలు విఫలమయ్యాయి. ఓటర్లను పోలింగ్ బూత్‌కు తీసుకువచ్చేలా కార్యకర్తలను పురిగొల్పకపోతే ప్రయోజనమేముంది. బిహార్‌లో భారతీయ జనతాపార్టీకి, జనతాదళ్ (యునైటెడ్) పార్టీకి అటువంటి సంస్థాగత దన్ను ఉన్నదని అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు తిరుగులేని రీతిలో రుజువు చేశాయి. ఎన్నికలు సమీపించిన తరుణంలో బిహార్‌లో మాత్రమే ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమాన్ని చేపట్టింది. ఇకపోతే హామీలు కూడా బాగా పనిచేశాయి. రూ.10వేల నగదు బదిలీ ఓటర్లకు లంచంగా ఇవ్వడమే, సందేహం లేదు. అధికార కూటమి అనేక హామీలు ఇచ్చింది. కొత్త ప్రభుత్వం ఆ వాగ్దానాలు అన్నిటినీ నెరవేరుస్తుందా? చూడాలి.ఈ ఎన్నికల్లో ఎన్డీయే కూటమికి మహిళలు, అత్యంత వెనుకబడిన వర్గాల ఓట్లు పెద్ద ఎత్తున పడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా చూస్తే ఈ ఎన్నికల్లో పురుషులతో (62.8) పోలిస్తే ఓటేసిన మహిళల శాతం (71.6) దాదాపు 9 శాతం ఎక్కువ. ఏవీటిలో ఎక్కువ శాతం ఎన్డీయే కూటమి అభ్యర్థులకే పడ్డాయి. ముఖ్యంగా.. ఎన్నికలకు ముందు ఆగస్టు 29న నితీశ్ సర్కారు ప్రకటించిన 'ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన'ను గేమ్ చేంజర్‌గా చెప్పొచ్చు. ఆ పథకం కింద.. ప్రతి కుటుంబంలో ఒక మహిళకు వ్యాపారం చేసుకోవడానికి సీడ్‌మనీ కింద రూ.10 వేలు చొప్పున పంపిణీ చేశారు. 1.4 కోట్ల మంది బిహారీ మహిళలకు ఈ సొమ్ము సరిగ్గా ఎన్నికలకు ముందు అందింది. అలాగే.. బాలికలకు ఉచిత విద్య, సైకిళ్లు, యూనిఫారాల వంటి పథకాలు, వితంతు పింఛన్ల పెంపు వంటి పథకాలతో మహిళల ఓట్లు పెద్ద ఎత్తున ఎన్డీయేకిపడ్డాయి. ముస్లింలు, యాదవుల(ఎంవై) ఓట్లపై కాంగ్రెస్, ఆర్జేడీ కూటమి గట్టిగా నమ్మకం పెట్టుకుంటే.. వారికి దీటుగా ఎన్డీయే కూటమి మహిళలు-ఈబీసీలు మంత్రాన్ని పఠించింది. బీజేపీ ఒకవైపు సంప్రదాయ అగ్రకులాలవారి ఓట్లపై దృష్టి సారించగా.. జేడీయూ కుర్మీలు, ఈబీసీల ఓట్లపై దృష్టి సారించిందిమరోవైపు.. కూటమిలోని లోక్‌జనశక్తి, రాష్ట్రీయ లోక్ మోర్చా, హిందుస్థానీ అవామ్ మోర్చా పార్టీలు దళితులు, వెనుకబడిన వర్గాల ఓట్లను రాబట్టడంలో కీలకపాత్ర పోషించాయి. సీమాంచల్ ప్రాంతంలో ముస్లింల ఓట్లు అత్యధికంగా మజ్లిస్ పార్టీకే పడ్డాయి. ముస్లిం ఓట్లలో చీలిక.. మహాగఠ్‌బంధన్ కు బలమైన పట్టున్న ప్రాంతాల్లో కూడా ఓటమికి కారణమైంది. ఆర్జేడీకి కోర్ ఓట్ బ్యాంకు అయిన యాదవుల ఓట్లు సైతం ఈసారి చీలి.. కొందరు ఎన్డీయేవైపు మొగ్గుచూపినట్టు సమాచారం.తొలగని జంగిల్‌రాజ్ భయం: బిహార్ ఓటర్లలో చాలామందికి.. ఒకప్పటి జంగిల్ రాజ్ భయం ఇంకా తొలగిపోలేదు. బిహారీలనగానే ఇతరప్రాంతాల్లో ఒకప్పుడు చిన్నచూపుచూసే పరిస్థితి ఉండేదని.. నితీశ్ పాలనతో ఆ మరక పోయి, బిహార్‌ను గౌరవంగా చూస్తున్నారనే భావన చాలా మంది బిహారీల్లో ఉంది. ఎప్పటిలాగానే ఈసారి కూడా బిహార్‌లో మోదీ మ్యాజిక్ కొనసాగింది. ఆయన సభలు, సంక్షేమ పథకాలు.. తటస్థంగా ఉన్న ఓటర్లను ఎన్డీయే వైపు సంఘటితం చేయడంలో కీలకపాత్ర పోషించాయి. బిహార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన 13 బహిరంగ సభల్లో పాల్గొన్నారు. పట్నాలో భారీ రోడ్‌షో నిర్వహించారు. చొరబాటుదారులకు ఆర్జేడీ-కారగ్రెస్ మద్దతు ఉందని.. ఆ పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు ప్రజాధనాన్ని దోచుకుతిన్నా యని, ఆటవిక పాలన కొనసాగించాయని పదేపదే గుర్తుచేశారు. రాష్ట్రంలోని పెద్దలందరూ ఆర్జేడీ పాలనలో సాగిన అరాచకాల గురించి ఈ తరం యువతకు తెలపాలని పిలుపునిచ్చారు. దీనిపై విస్తృతంగా జరిగిన చర్చ ఓటర్లపై బాగా ప్రభావం చూపింది. ఇవన్నీ విశ్లేషించని రాహుల్ తనదైన ర ఈతిలో విమర్శలు చేయడం ఆయన రాజకీయ అపరిపక్వతను సూచించింది.

# గ్యారంటీ లేని 'ఉపాధి'..?



మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (రేగా) వచ్చి ఇరవై ఏళ్లయింది. గ్రామీణ పేద వ్యవసాయ శ్రామికులకు సంవత్సరంలో కనీసం వంద రోజులపని కల్పనకు గ్యారంటీ చేసిన 'రేగా' స్ఫూర్తిని మోడీ ప్రభుత్వం తన పదేళ్ల జమానాలో అంతకంతకూ నిర్వీర్యం కావించడం ఆందోళనకర విషయం. పనుల్లేని సమయాల్లో ఉపాధి హామీ ద్వారా కొన్ని రోజుల్లోనైనా పేదల కడుపు నింపుతున్న చట్టానికి తూట్లు పొడిచి వారి పొట్ట కొట్టడం కేంద్ర ప్రభుత్వం మూటగట్టుకున్న దుర్మార్గం. ఉపాధి హామీపై మోడీ సర్కార్ రచిస్తున్న కుట్రలను వామపక్షాలు, ప్రజాసంఘాలు, ఎన్‌జిఒలు, పలు అధ్యయన సంస్థలు, సామాజిక కార్యకర్తలు ఎప్పటికప్పుడు వెలుగులోకితెచ్చి ఎండగడుతు న్నా వెనక్కితగ్గేదేలే.. అంటోంది. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లో రేగా పరిస్థితిఎంత అన్యాయంగా ఉందో'లిబ్‌టెక్' సంస్థకుండబద్దలు కొట్టింది. ఈ దుస్థితిమన ఒక్క రాష్ట్రానికే కాదు పలు బిజెపి పాలక రాష్ట్రాల్లో కొనసాగుతోంది. దేశంలో 12 కోట్ల మంది పేదలకు జాబ్ కార్డులు జారీ చేయగా వాటిలో యాక్టివ్‌గా ఉన్నవి ఐదున్నర కోట్లు మాత్రమే. ఒక్క ఏడాదిలో జాబ్‌కార్డుల సంఖ్య అమాంతం మూడున్నర కోట్లకు తగ్గిపోయింది. కోట్లలో జాబ్‌కార్డులు తగ్గిపోయాయంటే ఉపాధి హామీ చట్టం అమలు ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుంది. ఆ ప్రభావం గ్రామీణ పేదల ఉపాధిపై కచ్చితంగా పడుతుంది. యుపిఎ-1 ప్రభుత్వంలో వామపక్షాల ఒత్తిడితో 2005లో ఈ చట్టం రాగా 2006 సెప్టెంబర్‌లో 200 జిల్లాల్లో ప్రారంభించి 2008 నుంచి అన్ని జిల్లాలకు విస్తరించారు. 2008-09 బడ్జెట్‌లో రేగాకు ఖర్చు చేసింది రూ. 27 వేల కోట్లు. అప్పుడు కేంద్రం మొత్తం వార్షిక బడ్జెట్ రూ.6 లక్షల కోట్లు. ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం బడ్జెట్ రూ.50 లక్షల కోట్లు కాగా ఉపాధి హామీకి మోడీ ప్రభుత్వం ప్రతిపాదించింది 86 వేల కోట్లు మాత్రమే. అప్పటికి ఇప్పటికి బడ్జెట్ దాదాపు 8 రెట్లు పెరిగింది. ఆ దామాషాలో ఉపాధి హామీకి కనీసం రెండు లక్షల కోట్లు కేటాయించాలి. కానీ బిజెపి ప్రభుత్వం లక్ష కోట్లు కూడా కేటాయించలేదు. కేటాయించిన నిధులు పాత బకాయిలకు, మెటీరియల్ కాంపొనెంట్‌కు సరిపోతే ఇక కూలీలకు పనులు, వేతనాలు ఎక్కడీ అప్పటికి ఇప్పటికి జనాభా 20-30 కోట్ల వరకు పెరిగింది. గ్రామీణ పేదలకు ఉపాధి హామీ స్వల్పమేనని తెలుస్తుంది. మోడీ సర్కార్ వల్లించే వికసిత్ భారత్, సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్, జిడిపి వృద్ధి.. వగైరా వగైరా పేదలనుద్దేశించి కాదు కార్పొరేట్లు, సంపన్నుల కోసమని రూఢి అవుతుంది. కరోనా ఏడాది ప్రజల నుంచి వచ్చిన డిమాండ్ మేరకు లక్ష కోట్లకుపైన కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీకి వ్యయం చేసింది. కరోనా సమస్య వీడినా వ్యవసాయ సంక్షోభం, భారీ యాంత్రీకరణ, అర్బన్‌లో ఉపాధికి ఒత్తిడి వెరసి గ్రామాల్లో ఉపాధి లేక పేదలు అవస్థలు పడుతున్నారు. ఈ పరిస్థితులు ఉపాధి హామీ పనులకు డిమాండ్ పెంచుతున్నాయి. ఇదే సమయంలో ఆధార్, ఇకెవైసి వంటి సాంకేతిక కారణాలు చూపి పేదలను 'ఉపాధి'కి దూరం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు రాష్ట్రంలో ఉపాధి హామీని క్షీణింపజేస్తున్నాయని ఈ కాలంలో పని దినాలు, పనులు చేస్తున్న శ్రామికుల తగ్గుదల తెలుపుతున్నాయి. గతేడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు ఎనిమిది నెలల్లో ఎస్‌సిలకు కల్పించిన పని దినాలు 5.23 కోట్లు కాగా ఈ సంవత్సరం 3.30 కోట్లకు తగ్గాయి. ఇదే సమయంలో ఎస్‌టిలకు పని దినాలు 3 కోట్ల నుంచి 1.88 కోట్లకు తగ్గాయి. ఎస్‌సిల పని దినాలు 18.7 శాతం, ఎస్‌టిలకు 17 శాతం, మొత్తం పేదలకు 13.6 శాతం తగ్గాయి. పని దినాలు ఆ మేరకు తగ్గితే ఉపాధి పొందే వారి సంఖ్యా తగ్గుతుంది. వంద రోజుల పని పూర్తి చేసుకున్న కుటుంబాలను వేళ్లపై లెక్కించొచ్చు. సాంకేతిక కారణాలతో లక్షల్లో జాబ్ కార్డుల తొలగింపు ఉండనే ఉంది. వేతనాల చెల్లింపులకు రాష్ట్రంలో విధించిన ఆంక్షలు కఠినంగా ఉన్నాయి. రోజుకు కనీస వేతనం రూ.320 దక్కాల్సింది అంతకంటే తక్కువ అందుతోంది. వాటి కోసం కొన్ని నెలలు నిరీక్షించాల్సి వస్తోంది. గ్రామీణ ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో ఏడాదిలో200 రోజుల పనికి గ్యారంటీ, రోజుకు కనీస వేతనర 600 ఇవ్వాలన్న కార్మికుల కోర్కె సహేతుకమైనది. పట్టణ ప్రాం తాలకూ ఉపాధి హామీని విస్తరించాలన్న డిమాండ్ ఆలోచింప దగినది. పేదల కొనుగోలు శక్తి పెంచేందుకు, తద్వారా జిడిపి వృద్ధికి ఉపాధి హామీ వంటివి తోడ్పడతాయి. కేంద్రం, రాష్ట్ర ప్రభు త్వాలు ఆ దిశగా అడుగులేయడం అవసరం.

# కమలంలో కలకలం!



**హైదరాబాద్,తెలంగాణ దిశ :**తెలంగాణలోని బీజేపీ ఎమ్మెల్యేలు కట్టుతట్టుతప్పు తున్నట్లు కనిపిస్తుంది. గతంలో గోషామహల్ ఎమ్మెల్యేరాజాసింగ్ కూడా పార్టీకి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారు. ఆయనపై పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. అయితే ఆయన ఎమ్మెల్యే పదవిపై మాత్రం స్పీకర్ కు ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతో రాజాసింగ్ ఎమ్మెల్యేగానే కొనసాగు తున్నారు.అదే సమయంలో ఆయన తన మాటలను వెనక్కు తీసుకో వడం లేదు. ఇటీవల జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికల సందర్భంగా కూడా రాజా సింగ్ పార్టీకి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారు. కానీ ఆయన విషయంలో బీజేపీ ఏమీ చేయలేకపోతుం దన్న వ్యవహారం ఇప్పుడు పార్టీలో చర్చనీయాంశమైంది. మరొకవైపు తాజాగా బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రశంసించడం కూడా పార్టీలో చర్చనీయాంశమైంది. ఇటీవల ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి వెంట పాయల్‌శంకర్ ఆసాంతం ఉన్నారు. ఎమ్మెల్యేగా ముఖ్యమంత్రి వెంట ఉండటం తప్పు కాదు. కానీ తర్వాత జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై ప్రశంసల జల్లు కురిపించడమేఇప్పుడు పార్టీలో చర్చనీయాంశమైంది. జాతీయ స్థాయిలో కాంగ్రెస్, బీజేపీ ఉప్పు నిప్పుగా ఉంటాయి. అలాంటిది బీజేపీ ఎమ్మెల్యేగా ఉండి కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ నేతలు కూడా ప్రశంసించని రీతిలో పొగడ్తలు కురిపించడంపై పార్టీ రాష్ట్ర నేతలు కూడా సీరియస్ గా ఉన్నట్లు తెలిసింది. తన నియోజకవర్గానికి సంబంధించిన పనుల విషయంలో ముఖ్యమంత్రిని సభావేదికగా కోరవచ్చు. అంతే తప్ప బహిరంగ సభలో ముఖ్యమంత్రిపైనే సొంత పార్టీ నేతల కంటే ఎక్కువగా ప్రశంసించడం ఏంటన్న దానిపై ఇప్పటికే కొందరు నేతలు పాయల్ శంకర్ పై కేంద్ర నాయకత్వానికి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఆయన మాట్లాడిన మాటలతో పాటు, పత్రికా క్లిప్పింగ్ లు కూడా జాతీయ నాయకత్వానికి పంపారని చెబుతున్నారు. పాయల్ శంకర్ మాత్రం ధీమాగా ఉన్నారు. రాజాసింగ్ నే ఏమీ చేయలేని పార్టీ నాయకత్వం తనను ఏమి చేస్తారన్న ధీమాలో పాయల్ శంకర్ ఉన్నట్లు కనపడుతుంది. మొత్తం మీద తెలంగాణీజేపీ ఎమ్మెల్యేలు కట్టుతప్పుతున్నారన్న కామెంట్స్ పార్టీ వర్గాల నుంచి వినిపిస్తుంది.

# ఫ్యూచర్ సిటీలో ఇంటర్నేషనల్ స్టేడియం

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** విజన్-2047 పేరుతో రూపొందిస్తున్న అభివృద్ధి ప్రణాళి కలో, హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి మెట్రోపాలిస్‌గా తీర్చిది ద్దడానికి క్రీడా మౌలిక సదుపాయాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ బృహత్తర ప్రణాళికలో భాగంగా.. నగర శివారులో అంతర్జాతీయ క్రీడా ప్రమాణాలకు అనుగుణంగా భారీ నిర్మాణాలను చేపట్టడానికి రూపకల్పన చేశారు.రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌ను కేవలం ఆర్థిక కేంద్రంగానే కాక, వినోదం.. క్రీడలకు కేంద్రంగా మార్చాలనే లక్ష్యంతో ప్రత్యేకంగా ఎంటర్‌టైన్‌మెంట్ డిస్ట్రిక్ట్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ డిస్ట్రిక్ట్‌లో ముఖ్యంగా రెండు భారీ క్రీడా ప్రాజెక్టులను నిర్మించనున్నారు.అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం: దేశంలోనే అత్యాధునికమైన, ప్రపంచ స్థాయి మ్యాచ్‌లు నిర్వహిం చేందుకు వీలుగా 100 ఎకరాల విస్తీర్ణంలో ఒక అంతర్జా తీయ క్రికెట్‌స్టేడియంను నిర్మించాలని నిర్ణయించారు. ఈస్టేడియం నిర్మా ణం పూర్తయితే.. హైదరాబాద్‌లో రెండు అంతర్జాతీయ స్టేడియాలు (ఉప్పల్ రాజీవ్ గాంధీ స్టేడియంతో పాటు) ఉంటాయి.గోల్ఫ్ కోర్స్:ప్రముఖ క్రీడలలో ఒకటైన గోల్ఫ్ క్రీడను ప్రోత్సహించేందుకు 18ఎకరాల సువిశాల విస్తీర్ణంలో ఒక గోల్ఫ్ కోర్స్‌ను కూడా ఇదే ఎంటర్‌టైన్‌మెంట్ డిస్ట్రిక్ట్‌లో ఏర్పాటు చేయనున్నారు. ఇది నగరంలో గోల్ఫ్ క్రీడాభిమానులకు, అంతర్జాతీయ స్థాయి టోర్నమెంట్‌లకు దోహదపడుతుంది. ఎంటర్‌టైన్‌మెంట్ డిస్ట్రిక్ట్‌లో ఈ క్రీడా సదుపాయాలతో పాటు వినోదాత్మక అంశాలను కూడా జోడించారు. ఈ ప్రాంతం 15 వేల ఎకరాల రిజర్వ్ ఫారెస్ట్‌కు ఆనుకుని ఉండటం వల్ల.. పర్యావరణపరంగానూ ప్రాముఖ్యత సంతరించుకుంఖది.ఈ డిస్ట్రిక్ట్‌లో క్రీడా మైదానాలతో పాటు.. థీమ్ పార్కులు, రిసార్టులు, రాజీవ్ జూలాజికల్ పార్కును కూడా ఏర్పాటు చేయనున్నారు. ఇది హైదరాబాద్‌కు వినోద, పర్యాటక రంగంలో కొత్త ఆకర్షణను తీసుకురానుందిఈ క్రీడా, వినోద కేంద్రం మొత్తం ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్మితమవుతున్న నెట్-జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీ లో భాగంగా ఉంటుంది.

# జాతీయనేతలు ఎవరు..?

న్యూఢిల్లీ: జాతీయ రాజకీయాల్లో రాణించాలని, గుర్తింపు సాధించాలని చాలామంది నేతలు కోరుకుంటారు. అందులో సక్సెస్ అయ్యేది కొందరే. సాధారణంగా రాష్ట్రాల్లో రాజకీయం చేసేవారు కేంద్ర రాజకీయాలకు ఇష్టపడరు. కానీ తెలంగాణలో కేసీఆర్ వంటి వారు దేశ ప్రధాని అయిపోవాలని కలగన్నారు. చంద్రబాబు కంటే తన ఇమేజ్ ఎక్కువని భ్రమపడ్డారు. అయితే ఇలా జాతీయ రాజకీయాల్లోకి వెళ్లి గర్జించాలనుకున్న ఆయన తన కుమారుడి రాజకీయ భవిష్యత్తును ప్రమాదంలో పెట్టేశారు. కుమార్తెను కేంద్రమంత్రిగా చేసే అవకాశం వచ్చింది కానీ.. అదే కేంద్రంతో కయ్యానికి కాలు దువ్వారు. ఆమె జైలు జీవితానికి కారణం అయ్యారు. జైలు నుంచి వచ్చిన ఆమెను పార్టీ నుంచి బహిష్కరిం చారు. చంద్రబాబుకు ఇప్పుడే కాదు చాలాసార్లు జాతీయ రాజకీయాల్లో అవకాశం వచ్చింది. కానీ ఆయన మాత్రం రాష్ట్ర రాజకీయాల్లోనే ఉండాలని ఆసక్తి చూపారు. ఉమ్మడి ఏపీ లోను, నవ్యాంధ్రప్రదేశ్ లోను రాష్ట్రం మాత్రమే అభివృద్ధి చేయాలని కంకణం కట్టుకున్నారు. దేశ రాజకీయాల విషయంలో భ్రమ పడలేదు. 2018లో మోడీ నాయకత్వాన్ని వ్యతిరేకించి ఎన్డీఏ నుంచిబయటకు వచ్చారు. ఆ సమయంలో సైతం తానేదో ఈ దేశానికి ప్రధాని అయిపోతానని చెప్పలేదు. ఏపీకి తగు రీతిలో న్యాయం జరగలేదని మాత్రమే ఎదురు తిరిగారు.

చంద్రబాబు ఎన్నడు నేల విడిచి సాము చేయలేదు. వాస్తవాన్ని గుర్తించి మాత్రమే రాజకీయాలు చేశారు.ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో రాజకీయాలు అంటే చంద్రబాబు, రేవంత్, కెసిఆర్, జగన్మోహన్ రెడ్డి చుట్టూ నడిచాయి. ఇందులో జాతీయ పార్టీగా ఉన్న కాంగ్రెస్ నుంచి ముఖ్యమంత్రి అయ్యారు రేవంత్ రెడ్డి. ఆయన విషయాన్ని పక్కన పెడదాం. ఎందుకంటే కాంగ్రెస్ జాతీయస్థాయిలో తమ పార్టీ వ్యవహారాలను చూసుకుంటుంది కాబట్టి. 2019లో బిజెపి పరోక్ష సహకారంతో అధికారంలోకి వచ్చారు జగన్. ఒకటి కాదు రెండు కాదు 22 ఎంపీ స్థానాలతో మంచి విజయం సాధించారు. బిజెపికి పరోక్షంగా సహకారం అందించారు. బిజెపి సహకారాన్ని తీసుకున్నారు. కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలను ఉత్సవ విగ్రహాలుగా మార్చేశారు. ఒకరిద్దరు ఎంపీలు తప్ప అందరూ డమ్మీలే. కెసిఆర్ పరిస్థితి కూడా అదే. తనను తాను రాజుగా ప్రకటించుకున్నారు. ఇతర రాజకీయ పార్టీలు, జాతీయ పార్టీలను శత్రువులుగా మార్చుకున్నారు.కానీ చంద్రబాబు అలా కాదు. జాతీయ రాజకీయాల్లో తనకంటూ ఒక ముద్ర చాటుకునే ప్రయత్నం చేశారే తప్ప.. తానే కింగ్ అని భావించలేదు. అటల్ బిహారీ వాజ్పేయి హయాంలో జిఎంసి బాలయోగిని లోక్సభ స్పీకర్ గా ఎంపిక చేయడంలో చంద్రబాబు కృషి ఉంది.

ఒక ఎర్రం నాయుడు, ఒక అశోక్ గజపతి రాజు,, ఓసుజనా చౌదరి, ఓ రామ్మోహన్ నాయుడు, ఓ పెమ్మసాని చంద్రశేఖర్.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎంతోమంది కేంద్రమంత్రులు అయ్యారు టిడిపి హయాంలో. కానీ తన రాజకీయ ప్రయోజనాల కోసం మాత్రమే జగన్మోహన్ రెడ్డి కేంద్ర పెద్దలతో సఖ్యత ఏర్పరచుకున్నారే తప్ప.. ఒక్కరంటే ఒక్కరికి రాజకీయ ప్రయోజనాలు కల్పించారా?

కెసిఆర్ పరిస్థితి కూడా అదే. తాను ఒక సీనియర్ అని ఎక్కువగా విర్రవీగుతుంటారు. జాతీయస్థాయిలో ముద్రచాటి ఈ దేశానికి ప్రధాని అయిపోవాలని కలలు కన్నారు. సొంత కుమార్తెకు కేంద్రమంత్రి పదవి వచ్చే అవకాశం ఉన్న.. పొందలేకపోయారు కేసీఆర్. ఇలా ఎలాచూసుకున్నా కెసిఆర్, జగన్మోహన్ రెడ్డి కంటే చంద్రబాబు జాతీయ స్థాయిలో బలమైన ఉనికి చాటుకున్న వారే.

# కుళ్లుకుంటున్న ప్రపంచ మీడియా

న్యూఢిల్లీ : అమెరికా భారత్‌పై టారిఫ్‌లు విధించి, రష్యాపై ఆంక్షలు విధిస్తున్న నేపథ్యంలో, రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత్ పర్యటనకు వచ్చారు.రష్యా నుంచి అయిల్ కొనుగోలు కారణంగా అమెరికాకు సమస్యా.లేక భారతే అమెరికాకు సమస్యగా మారిందా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే విషయమై తాజాగా రష్యా అధ్యక్షుడు పుతిన్ కూడా స్పందించారు. అసలు సమస్య ఏమిటని నిలదీశారు. రష్యా నుంచి భారత్ అయిల్ కొనడం తప్పయితే.. రష్యా నుంచి అమెరికా యురేనియం ఫ్యూయల్ కొనడం కూడా తప్పు కదా అన్ని ప్రశ్నించారు. దీనికి ట్రంప్ వద్ద సమాధానం లేదు.విదేశీ మీడియా, సామాజిక మాధ్యమాల్లో భారత్?రష్యా బంధం దృష్టాంతంమోదీ, పుతిన్ భేటీ సంగీతాన్ని విదేశీ పత్రికలు, కార్టూన్ల ప్రతికూలంగా సాంఘిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారు. రష్యా సోషల్ నెట్‌వర్క్లలో కూడా ట్రంప్‌ను ప్రతినాయకుడిగా చూపించే పోస్టులు వ్యాప్తి చెందుతున్నాయి. ఈ చర్యలు భారతరష్యా సఖ్యతకు వ్యతిరేకంగా ఇతర దేశాల ఆందోళనను ప్రతిబింబిస్తాయి.భారత్‌లో రష్యా అధ్యక్షుడు పుతిన్ పర్యటన వేళ పాకిస్తాన్ అరుణాచల్ ప్రదేశ్‌ను చైనా భాగంగా ప్రకటించి సంబంధ వివాదాలను పుట్టించాలని యత్నించింది. భారతంలో పాకిస్తాన్ సింధ్ ప్రాంతం కలవ నాటకి సూచనలు వచ్చినప్పటికీ, పాకిస్తాన్ ఈ రంగంలో లాంటి చర్యలతో విభేదాల్ని ఆశ్చర్యపరుస్తోంది. చైనా భాగస్వామ్యంతో పాకిస్తాన్ ఈ అంశంలో ప్రాధాన్యత చూపిస్తూ భారత నీతులకు వ్యతిరేఖ పోలికలను ప్రేరేపిస్తోంది.భారత రష్యా పరస్పర నమ్మకం, విశ్వాసం పెంపొందిస్తూ, రెండు దళాలు సత్సంబంధాలు మెరుగుపరచుకునేందుకు సంతకాలు చేసుకున్నాయి.

# పంటలపై ఆగని గజదాడులు




**కల్లూరు:** పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. పాళెం, పాతపేట, ఆవులపెద్దిరెడ్డిగారిపల్లె పంచాయతీల్లో రాత్రి నుంచి వేకువజాము వరకు ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేసింది. ముందుగా పాళెంలోని చలపతికి చెందిన అర ఎకరా వరి, సోమశేఖర్‌కు చెందిన అర ఎకరా టమోటా పంటను నాశనం చేశాయి. అక్కడినుంచి ఆవులపెద్దిరెడ్డి గారిపల్లె సమీపానికి చేరుకుని నాగరాజుకు చెందిన అర ఎకరా వరిని తొక్కేశాయి. తర్వాత పాతపేట పంచాయతీ పూరేడువారిపల్లె వద్దకెళ్లి సత్యనారాయణకు చెందిన 50 అరటిచెట్లు, 10 కొబ్బరిచెట్లు, పశుగ్రాసం, వాసుకు చెందిన అర ఎకరా వరిని ధ్వంసం చేశాయి. కల్లూరులోని శ్రీనివాసులకు చెందిన 5 మామిడిచెట్లు, రైతు మురళికి చెందిన 3 కొబ్బరిచెట్లను విరిచేశాయి. పాతపేట సమీపంలోని చాకిరేవు వంక వద్దకు చేరుకుని పగలంతా తిష్ఠ వేశాయి. ఈ ఏనుగుల గుంపును సదుం మండలం మీదు గా పలమనేరు కౌండిన్య అడవివైపు మళ్లించాలని ఎఫ్ఆర్వోలు థామస్ సుకుమార్, బాలకృష్ణారెడ్డి, డిప్యూటీ రేంజర్ కుప్పుస్వామి, ఎఫ్ఎసవో షఫి, ఎఫ్‌బీవోలు మున్నా, శ్రీదేవి తమ సిబ్బందితో ప్రయత్నం చేశారు. అయితే సాయంత్రానికి మళ్లీ పులిచెర్ల మండలం వైపు అడుగులు వేశాయి. అటవీశాఖ అధికారులు టపాకాయలు కాల్చినా రాత్రి ఏడు గంటలసమయానికి కల్లూరు సమీపంలోని ఎద్దలవారిపల్లె వద్దకు చేరుకున్నాయి. కల్లూరు సమీపానికి ఏనుగుల గుంపు రావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ రాత్రికి పాళెం పంచాయతీ సమీపంలోని తూర్పు అటవీ విభాగంలోకి ఏనుగుల గుంపును రానీ యకుండా అన్ని చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

# కుంకీలతో గజదాడులను అరికడతాం



కల్లూరు: జనావాసాలు, పంట పొలాలపై ఏనుగుల దాడులను అరికట్టేందుకు త్వరలో కుంకీ ఏనుగులతో రక్షణ చర్యలు తీసుకుంటామని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ వైల్డ్‌లైఫ్ అజయ్‌కుమార్ నాయక్, తిరుపతి చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సెల్వం తెలిపారు. పులిచెర్ల మండలం పాళెం పంచాయతీ సమీపంలోని తూర్పు అటవీ ప్రాంతాన్ని చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లా డీఎఫ్‌వోలు భరణి, వివేక్, జగన్నాధసింగ్‌లతో కలిసి వారు పరిశీలించారు. పలమనేరు కౌండిన్య అటవీప్రాంతం నుంచి రెండేళ్ల క్రితం పులిచెర్ల మండలంలోకి ప్రవేశించిన ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేస్తున్న నేపథ్యంలో ఏనుగులు దాడులు చేస్తున్న తీరు, అధికారులు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. ఏనుగుల గుంపు సంచరించే అటవీ ప్రాంతాలను మ్యాప్‌లో పరిశీలించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ నాయక్ మాట్లాడుతూ ఏనుగుల గుంపు జనారణ్యంలోకి వస్తుండడంతో జరుగుతున్న నష్టంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గజదాడులను కుంకీ ఏనుగుల సాయంతో అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే ఏనుగుల గుంపును కౌండిన్య అటవీప్రాంతం వైపు తీసుకెళ్లేందుకు కుంకీ ఏనుగులను తీసుకొస్తామని తెలిపారు. ఫ్లయింగ్‌స్క్వాడ్ డీఎఫ్‌వో గురుప్రభాకర్, మదనపల్లె సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసులు, ఎఫ్ఆర్వోలు థామస్ సుకుమార్, ప్రియాంక, వేణుగోపాల్, మాధవి, ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్ఆర్వో చంద్రశేఖర్,
డిప్యూటీ రేంజర్ కుప్పుస్వామి, ఎఫ్ఎస్‌వో మహ్మద్ షఫీ, ఎఫ్‌బీవోలు పాల్గొన్నారు. పులిచెర్ల మండలం దేవళంపేట పంచాయతీలో రాత్రి పంటలపై గజదాడులు కొనసాగాయి. కొబ్బరి, వరి, మామిడి పంటలకు అపారనష్టం వాటిల్లింది. కుమ్మరపల్లిలో సి. కృష్ణయ్యకు చెందిన 11 కొబ్బరిచెట్లు, 3 మామిడిచెట్లు, ఎం. కృష్ణయ్యకు చెందిన 3 మామిడిచెట్లతో పాటు పశుగ్రాసాన్ని ఏనుగులు ధ్వంసం చేశాయి. వంకాయలపాటివారిపల్లిలో రవీంద్ర నాయుడికి చెందిన ఎకరా వరిపంటను ధ్వంసం చేసిన ఏనుగులు 20 మామిడిచెట్లను విరిచేశాయి.

# మనసు పెడితేనే మహిళా మార్టులు!



**అనంత,తెలంగాణ దిశ :** మహిళా మార్టులు ఈ మధ్య తరచుగా వినిపిస్తున్న పేరు. ప్రభుత్వ భవనంలో కొన్ని మార్టులు ఏర్పాటు చేసి వాటిని డ్వాక్రా గ్రూపులకు అప్పగించి వారి ఉత్పత్తులను అమ్ముకొనేలా రూపొందించి వారి అభివృద్ధికి బాటలు పరిచేలా చేయడమే వీటి ఉద్దేశం. అనంతలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ద్వారా మహిళా మార్టులు ఏర్పాటు చేయడానికి అన్ని వనరులు ఉన్నా ఇప్పటి దాకా అధికారులు ఆదిశగా కదలిక లేదు. తాజాగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ నగరంలో మహిళా మార్టులు ఏర్పాటు చేయబోతున్నామని చెప్పడంతో ఈ అంశం ఆసక్తికరంగా మారింది. అనంతపురంలో ప్రభుత్వ భవనం ఉంటే మహిళలకు ఉచితంగా ఇచ్చి అక్కడ మార్టు ఏర్పాటు చేయడానికి తన సహకారం అందిస్తానని ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మెప్మా అధికారులను సైతం ఆదేశించడంతో అధికారులు స్థలం అన్వేషణ చేస్తున్నారు. అనంతపురం నగరంలో పేద, మధ్య, సంపన్న మహిళలు సైతం డ్వాక్రా సంఘాల్లో సభ్యులుగా ఉన్నారు. ఇప్పటికే సంఘాల్లో సభ్యులుగా ఉండటంతో మనసు పెడితే నగరంలోని పలు ప్రాంతాల్లో కనీసం 10 మార్టులు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. అనంతలో మార్టు ఏర్పాటు చేయడానికి అవకాశం ఉన్నా వైకాపా హయాంలో ఒక్కటీ ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం చొరవ చూపితే ఏర్పాటు సాధ్యం అయ్యే అవకాశం ఉంది. డ్వాక్రా సంఘాలకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు ఆసక్తి చూపుతున్నారు. లక్ష్యాలు నిర్దేశిస్తుండటంతో రుణం సులభంగా ఇచ్చే అవకాశం ఉంది. బ్యాంకు లింకేజీ ద్వారా ప్రతి సంఘానికి రూ.10 లక్షలు ఇస్తున్నారు. మార్టు ఏర్పాటు చేస్తే అదనంగా రూ.20 లక్షలు ఇస్తారు. ఈ నేపథ్యంలో బ్యాంకులు ఇచ్చిన రుణం ద్వారా రూ.30 లక్షలు తీసుకొని ఐక్యంగా ఉన్న కొన్ని సంఘాలను కనీసం నాలుగు సంఘాలు రూ.1.20 కోట్లు ఖర్చు చేస్తే ఒక్కో చోట ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం ఉంది. ఇందుకు ఐక్యత, నిబద్ధత, అధికారుల ప్రోత్సాహం ఉంటేనే సాధ్యం అవుతుంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో రెండేళ్ల క్రితమే రెండు మహిళా మార్టులు ఏర్పాటు చేశారు. నార్పలలో ఏర్పాటు చేసిన మహిళా మార్టు ఆశావహంగా సాగుతోంది. ఇక్కడ మండలంలోని మహిళలు అంతా కలిసి ఒక్కో సంఘం సభ్యురాలి నుంచి రూ.200 నుంచి రూ.300 వరకు మహిళా మార్టుకు చెల్లించి సభ్యులు అంతా కలిసి కో ఆపరేటివ్ సొసైటీగా ఏర్పాటు చేసుకోవడంతో అందరూ భాగస్వామ్యులు అవుతారు. మహిళా సంఘంలోని సభ్యులే సరకులు కొనుగోలు చేయడం, నిత్యం మార్కెట్‌కు అనుగుణంగా ధరలు నిర్ణయించి ఇతర ప్రైవేటు వాటి కంటే తక్కువ ధరకు అంటే కొంతవరకు మాత్రమే లాభం ఉంచుకొని విక్రయాలు చేస్తారు. రెండేళ్లకే ఆయా మహిళా గ్రామైక్య సంఘాలకు రూ.8.78 లక్షలు ఆదాయాన్ని జమ చేశారు. బత్తలపల్లిలో ఉన్న మహిళా మార్టును సక్రమంగా నిర్వహించుకోలేక పోవడంతో కనీసం బ్యాంకుకు సక్రమంగా రుణం చెల్లించలేని పరిస్థితి ఉంది. నిబద్ధత, మార్కెట్‌కు అనుగుణంగా, అధికారుల నిత్యం పరిశీలనతో మార్టు నిర్వహిస్తేనే లాభాల బాటలో పయనిస్తుందనడంలో నార్పలలోనే మార్టు నిదర్శనం.

# రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తాం: కలెక్టర్



**హిందూపురం,తెలంగాణ దిశ :** ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో ఉన్న సౌకర్యాలు, సర్జన్, స్పెషలిస్టుల సేవలు, ఎన్టీఆర్ వైద్యసేవలు సమర్థంగా సద్వినియోగం చేసుకొని రోగులకు మెరుగైన వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకొంటామని జిల్లా కలెక్టర్ చేతన్ పేర్కొన్నారు. హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలోని సమావేశ భవనంలో తొలి హెచ్‌డీసీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్‌తోపాటు డీసీహెచ్ఎస్ ఉపేంద్రనాయక్, ఆసుపత్రి సూపరింటెండెంట్ లింగన్న, ఆర్ఎంవో డేవిడ్‌రాజు, హెచ్‌డీసీ సభ్యులు విద్యాసాగర్, ప్రభుకుమార్, శ్రీదేవీ పాల్గొని ఆసుపత్రి అభివృద్ధికి తీసుకోవాల్సిన విషయాలపై విస్తృతంగా చర్చించారు.
అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ ఆసుపత్రిలో వ్యాధి బాధితులకు మెరుగైన వైద్యం అందించాలన్నదే అందరి సంకల్పమన్నారు. దీనికి ఉన్న సౌకర్యాలేమి టి, ఇంకా ఎలాంటి సదుపాయాలు అవసరం, అనే విషయాలపై సమావేశం లో కమిటీ సభ్యులు, తాము చర్చించామన్నారు. హెచ్‌డీసీ నిధులు మంజూరయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు.
ఆసుపత్రికి ప్రసవానికి వచ్చిన వారిని పూర్తిగా పరిశీలించి ఇక్కడ వైద్యసేవలు అందించేందుకు అవసమైన సౌకర్యాలు లేని సమయంలో మాత్రమే ఇతర ప్రాంతాలకు రెఫర్ చేయాలని, దీనిపై వైద్యులకు సూచనలివ్వాలని కలెక్టర్ సూపరింటెండెంట్‌కు సూచించారు. ఆసుపత్రిలో వైద్యసేవలు కొలిక్కి తీసుకొస్తామని అందులో భాగంగానే ఆర్డీవో తాను ఆసుపత్రిని తనిఖీ చేస్తున్నామన్నారు. సాయంత్రం వేళల్లో ఓపీకి వైద్యులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విధులకు హాజరుకాకుండా ఇద్దరు వైద్యులు జీతం తీసుకొంటున్నారని విలేకరులు కలెక్టర్‌తో ప్రస్తావించగా దీనిపై నివేదిక అందించాలన్నారు. అనంతరం కలెక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవల కౌంటర్, మాతాశిశు ఆసుపత్రిని పరిశీలించి ఫీడింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని సూపరింటెండెంట్‌కు సూచించారు.

# అందని సాగునీరు..

**గోవిందరావుపేట,తెలంగాణ దిశ :** లక్నవరం జలాశయంలో సమృద్ధిగా సాగు నీరు ఉన్న గోవిందరావుపేట మండలంలోని ఆయకట్టు రైతులకు అందని దుస్థితి నెలకొంది. జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 33.5అడుగులు (1.945 టీఎంసీలు) దాటి ప్రవహించి ఇటీవల మత్తడి పోసింది. వర్షాలు తగ్గడంతో పంటలు ఎండిపోతున్నాయి. ప్రధాన కాల్వలో పూడిక, పిచ్చిమొక్కలు పెరగడంతో కాల్వల నుంచి నీరు రాక రైతులు అవస్థలు పడుతున్నారు.
దీంతోచేసేది లేక మూడేళ్లుగా రైతులందరూచందాలు వేసుకొని కాల్వల్లో పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేస్తున్నారు. నీటిపారుదల శాఖ అధికారులు దీనిపై దృష్టి సారించడం లేదు. జలాశయంలో సాగుకు సరిపడా నీరు ఉన్న కాల్వల నుంచి నీరు అందక చాలా చోట్ల పొలాలు బీటలు వారుతున్నాయి. లక్నవరం జలాశయానికి ఐదు ప్రధాన కాల్వలు ఉన్నాయి. రంగాపూర్, నర్సింహుల, 1,2, కోట కాల్వ, శ్రీరాంపతి కాల్వలు ఉన్నాయి. ప్రధాన కాల్వల్లో పూడిక, పిచ్చి మొక్కలు చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. గతంలో రైతుల నుంచి నీటి తీరువా వసూలు చేసి కొంత మొత్తం కాల్వల నిర్వహణకు కేటాయించేవారు. దానిని రద్దు చేయడంతో సమస్య తీవ్రమైంది. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని ప్రధాన కాల్వల పూడికతీత పనులకు నిధులు కేటాయించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## దళారులు చెప్పిందే ధర..

# కర్షకుడి ఇంట కన్నీటి ధార



**కొత్తచెరువు,తెలంగాణ దిశ :** జిల్లాను కొద్దిరోజులుగా వరుణుడు వీడటం లేదు. రోజూ ఏదో ఒక సమయంలో పలకరిస్తూనే ఉన్నాడు. కర్షకులకు కన్నీరు మిగిలిస్తున్నాడు. ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలు చేతికి వచ్చే సమయంలో వరద కారణంగా దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కనీసం పెట్టుబడి కూడా చేతికి అందకపోతే ఎలాగని కన్నీరు మున్నీరవుతున్నారు. వర్షాలకు వేరుసెనగ, మొక్కజొన్న, పత్తి, కంది, టమాటా తదితర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక, విక్రయించుకునేందుకు మార్కెట్ సౌకర్యం లేక దళారులు చెప్పిన ధరకే విక్రయించు కోవాల్సిన పరిస్థితి వచ్చింది. పంటలు వర్షానికి తడిసిపోవడం, మొల్లకెత్తడంతో కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఇంకా ప్రారంభించకపోవడంతో దళారులు రంగ ప్రవేశం చేసి, నచ్చిన ధరకు కొనుగోలు చేస్తున్నారు. తుకాల్లో సైతం మోసాలు చేస్తూ మరింత నష్టం మిగిలిస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో ఇటీవల కురిసన వర్షాలకు 1,488 హెక్టార్లలో పంట దెబ్బతిందని అధికారులు నివేదికలు రూపొందించారు. జిల్లాలో సాగు విస్తీర్ణం 2,44,763 హెక్టార్లు ఉండగా, 1,49,242, హెక్టార్లలో పంటలు సాగు చేశారు. ఇందులో 1488 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపారు. జిల్లాలో వేరుసెనగ 580 ఎకరాలు, వరి 612, జొన్న 64, మొక్కజొన్న 127, కొర్ర 24, కంది 34, పత్తి 41, సామ 4, పొగాకు 2 చొప్పున ఎకరాల్లో నష్టం జరిగినట్లు అధికారులు లెక్కలు చూపుతున్నారు. జిల్లాలో ప్రధానంగా వేరుసెనగ 1,74,910 హెక్టార్లలో, వరి 5,031, కంది 26,528, ఉలవ 9,193, జొన్నలు 1,418, సజ్జలు 904, మొక్కజొన్న 15,221, కొర్ర 667, పెసలు 1046, అలసంద 924, ఆముదం 3,230, పత్తి 2,339 హెక్టార్లలో పంటలు సాగు చేశారు. తీరా చేతికి వచ్చే సమయంలో వర్షాలు కురుస్తుండటంతో పంటలు నిల్వ చేసేందుకు సౌకర్యం లేక తడిసి దెబ్బతిన్నాయి. 45 కేజీల వేరుసెనగ బస్తా రూ.2500లకే, మొక్కజొన్న క్వింటా రూ.2000లకే దళారులకు విక్రయిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. కొత్తచెరువు మండలం ఇరగంపల్లికి చెందిన రైతు రామలింగం మూడెకరాల్లో వేరుసెనగ సాగు చేశారు. తుపానుకు ముందే రెండెకరాల్లో పంట తొలగించారు.
ఎకరాలోని పంట తొలగించి పొలంలో ఉన్నప్పుడే తుపాను పట్టుకుంది. నాలుగైదు రోజులపాటు ఎడతెరిపిలేని వర్షంతో పొలంలో కాయలు తడిసిపోయాయి. దీంతో వేరుసెనగ కట్టే కుళ్లిపోగా కాయలు రంగుమారి, మోసులెత్తాయి. ఎకరాలో పండిన వేరుసెనగ కాయలు విడిపించటానికి రూ.పదివేల కూలి భరించాల్సి వచ్చింది. దెబ్బతిన్న దిగుబడులను కొనుగోలు చేయటానికి వ్యాపారులు ముందుకు రాని పరిస్థితి. పెట్టుబడీ దక్కడం లేదని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

# విభిన్న ఉత్పత్తులకు విస్తృత మార్కెటింగ్



**అనంత,తెలంగాణ దిశ :** బుక్కరాయ సముద్రంలో గంగేశ్వరి నిర్వహిస్తున్న ఫ్లోర్ క్లీనింగ్ యూనిట్‌ను పరిశీలిసున్న డీపీఎం గంగాధర్ పరిశ్రమలు పెట్టి ఉత్పత్తులను సులువుగా తయారు చేసినా మార్కెటింగ్ చేయడం కష్టతరమయ్యేది. డ్వాక్రా మహిళా గ్రూపులు తయారు చేసిన వాటికి సరైన మార్కెటింగ్ సౌకర్యం ఉండేది కాదు. దీంతో విభిన్నంగా ఉన్నా స్థానికంగానే విక్రయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల ఆర్థికాభివృద్ధిపై దృష్టి సారించారు. పలు సరికొత్త మార్కెటింగ్ విధానాలను తెరపైకి తీసుకొచ్చి మహిళలను ఔత్సాహిక పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దే దిశగా తొలి అడుగుపడింది. ఇప్పుడు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ అవకాశాలు కల్పించి.. ఈ-కామర్స్‌లో విక్రయించు కొనే విధంగా అవకాశాలు కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సెర్ప్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఇందుకు అనుగుణంగా అధికార యం త్రాంగం కసరత్తు ప్రారంభించింది. గృహాలంకరణ వస్తువులు, తినుంబం దారాలు ఏవైనా గ్లోబల్ మార్కెట్‌లో ప్రవేశించాలంటే ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ) వేదిక ద్వారా సాధ్యం. ఈ విధానంలో ఇంట్లో నుంచే విక్రయాలు సాగించవచ్చు. ప్రస్తుతం లావాదేవీలు ఆన్‌లైన్ డిజిటల్ తరహాలో ఉన్నాయి. గార్లదిన్నె, నార్పల, రాప్తాడు, బుక్కరాయ సముద్రం, అనంతపురం, డి.హీరేహాళ్, యాడికి, కంబదూరు,
పామిడి తదితర ప్రాంతాల్లో వేరుసెనగ, ఆముదం, సన్‌ఫ్లవర్ నూనెలు, పట్టు చీరలు, వాటర్ బాటిళ్లు, డోర్ కర్టెన్లు, గార్మెంట్స్, ఫినాయిల్, స్వీట్లు, బిస్కెట్లు, మిల్లెట్స్, ఫ్లోర్ క్లీనర్ టూవీలర్ బ్యాగులు,
లెదర్ బొమ్మలు, బెల్లం, మసాల పౌడర్లు గుర్తించారు. పలు రకాల ఉత్పత్తులు మంచి గుర్తింపు వస్తోంది. గార్లదిన్నెలో చిరుధాన్యాలతో తయారు చేసిన రాగి మాల్టు, చిక్కీలు, నిప్పట్లు ఇప్పటికే ఓఎన్‌డీసీలో పొందుపరిచారు రుద్రంపేటలో తయారు చేసే గిఫ్టులు, గృహ అలంకరణ వస్తువులను ఆన్‌లైన్‌లో ఉంచారు. రాప్తాడు మండలంలో బిస్కెట్లు తయారీలో మహిళలు ముందుంటున్నారు. జన్మభూమి నగర్‌కు చెందిన ముత్యాలమ్మ మహిళా సంఘం సభ్యురాలు సుమియా డోర్ డెకరేషన్ ఫ్లవర్స్‌ను ఉత్పత్తి చేస్తూ అమ్మకాల్లో ముందుంటోంది.

# బాధ్యత తీసుకోండి...బాగు చేయండి



**అనంతపురం,తెలంగాణ దిశ :** కరవు జిల్లాలో 1.45 లక్షల ఎకరాలకు సాగునీరు, 10 లక్షల మందికి తాగునీరు అందించే తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ) ఆధునికీకరణ పనులను గత వైకాపా ప్రభుత్వం అటకెక్కించింది. ఐదేళ్లలో కనీసం తాత్కాలిక మరమ్మతులూ చేయించలేదు. డిస్ట్రిబ్యూటరీలు, పంట కాలువల్లో కంపచెట్లు పెరిగి నీరు చివరి ఆయకట్టుకు అందని పరిస్థితి నెలకొంది. ప్రధాన కాలువ ఎక్కడికక్కడ గండ్లుపడి బలహీనంగా మారింది. ఫలితంగా తుంగభద్ర నీరు 2,600 క్యూసెక్కులకు గాను 1,800 క్యూసె క్కులే తీసుకుంటున్నారు. తెదేపా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆధునికీకరణ పనులపై రైతుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టి వేగంగా ఆధునికీకరణ పనులు చేపట్టాల్సిన బాధ్యత కూటమి ప్రజాప్రతినిధులపై ఉంది. ఇప్పుడు ప్రయత్నాలు మొదలుపెట్టి వచ్చే వేసవిలో పనులు జరిపించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. గడిచిన ఐదేళ్లలో నిర్వహణ లేకపోవడంతో ప్రధాన కాలువలపై ఉన్న వంతెనలు చాలావరకు కూలిపోయాయి. అక్కడ క్కడ గండ్లు పడి కట్ట బలహీనంగా తయారైంది. తూములు ధ్వంసమయ్యా యి. ప్రధాన కాలువపై అత్యవసరంగా చేపట్టాల్సిన 11 పనులపై ప్రతిపాదనలు సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆయా పనులపై జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో చర్చలు జరిపారు. ఈక్రమంలో రూ.35 కోట్లు విలువైన పనులకు జల వనరుల శాఖ అనుమతులు మంజూరు చేసింది. టెండర్లు ఖరారు చేసి వచ్చే ఏడాది జనవరి నుంచి పనులు మొదలుపెట్టే అవకాశం ఉంది. రూ.35 కోట్లతో కణేకల్లు చెరువు 3వ తూము, పీఏబీఆర్, ఎంపీఆర్ డ్యాంలకు సంబంధించిన రెగ్యులేటర్లు, అండర్ టన్నెళ్లు, 5 వంతెనలు, 15 కిలోమీటర్ల మేర లైనింగ్ పనులు చేపట్టనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యవసరంగా చేపట్టాల్సిన పనులకు మాత్రమే అనుమతులు ఇచ్చింది. ఆధునికీకరణకు శాశ్వతప్రాతిపదికన పనులు పూర్తి చేస్తేనే ఆయకట్టు రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం జరుగుతుంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రజాప్రతినిధులు ఆ దిశగా చొరవ చూపాల్సి ఉంది. 2007లో రూ.463 కోట్ల అంచనాతో ఆధునికీకరణ పనులు మొదలయ్యాయి. ఆరు ప్యాకేజీలుగా విభజించి 2019 నాటికి 67 శాతం పూర్తి చేశారు. ధరలు పెరగడంతో మిగిలిన పనులు పూర్తిచేయడానికి అవసరమని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు చెబుతున్నారు. అత్యవసరంగా చేపట్టాల్సిన పనులపై దృష్టి సారించాం. టెండరు ప్రక్రియ పూర్తయ్యాక వేగంగా పనులు జరిగేలా చొరవ చూపుతాం. ఆరు ప్యాకేజీల పరిధిలో ఆధునికీకరణ పనులకు సంబంధించి అంచనాలు రూపొందించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ప్రభుత్వం నుంచి ఆమోదం తీసుకుని వీలైనంత వేగంగా పనులు మొదలుపెడతాం.

# పల్లె చిత్రం.. మారుతోంది



**సూళ్లూరుపేట,తెలంగాణ దిశ :** జిల్లాలోని 34 మండలాల్లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఈ మేరకు జిల్లాలో రూ. 3,907.10 లక్షలతో 911 పనులు చేపట్టారు. మధ్య ప్రతి పంచాయతీలో పల్లె పండగ పేరుతో భూమిపూజ చేశారు.
అనంతరం పనులు పట్టాలెక్కిస్తుండటంతో గ్రామాల్లోని వీధులు చాలావరకు సీసీ రోడ్లుగా రూపుదిద్దుకుంటున్నాయి. పనులన్నింటినీ సంక్రాంతిలోగా పూర్తిచేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఇప్పటికే ఆదేశించారు. పర్యవేక్షణ బాధ్యత పంచాయతీరాజ్ ఇంజినీర్లకు అప్పగించారు. గుత్తేదారులు సంబంధిత ఎంపీడీవోల వద్ద ఎంవోయూ చేసుకోవాల్సి ఉంది. పనులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది. నాణ్యత నియంత్రణ విభాగం అధికారులు క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేపట్టి, పరిశీలించనున్నారు. ఎప్పుడూలేని విధంగా ఈదఫా ఉపాధిహామీ పథకం చీఫ్ విజిలెన్సు ఆఫీసర్‌గా ఏఎస్పీ స్థాయి అధికారిని నియమించారు. ఎక్కడైనా నిధులను దుర్వినియోగం చేస్తే చీఫ్ విజిలెన్సు ఆఫీసర్ ఆధ్వర్యాన వారి బృందం క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోనుంది. నులన్నింటినీ సంక్రాంతిలోగా పూర్తిచేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఇప్పటికే ఆదేశించారు. పర్యవేక్షణ బాధ్యత పంచాయతీరాజ్ ఇంజినీర్లకు అప్పగించారు. గుత్తేదారులు సంబంధిత ఎంపీడీవోల వద్ద ఎంవోయూ చేసుకోవాల్సి ఉంది. పనులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది. పనులు ప్రారంభించాం .. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పల్లె పండుగ పేరుతో పనులు ప్రారంభించాం. గ్రామాల్లో రద్దీ ఉండి, ఇప్పటివరకు ఎలాంటి అభివృద్ధికి నోచుకోని రోడ్లను గుర్తించి, ఆ మేరకు సీసీ రహదారులు నిర్మిస్తున్నాం. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ మాదే. చెల్లింపులు ఎంపీడీవో పరిధిలో జరుగుతాయి.

# అలవాటు పడితే.. అంతా అస్తవ్యస్తం!



సమాజాన్ని పట్టిపీడిస్తున్న ఎన్నో రుగ్మతలు సామాజికంగా ఆర్థికంగా మనపై తీవ్ర ప్రభావం చూపిస్తాయి. అయితే వాటితో పాటు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీసే ఏకైక రుగ్మత మాదకద్రవ్యాల వినియోగం. మద్యం, పొగాకు ఉత్పత్తులకి లైసెన్సులు ఇచ్చి ప్రోత్సహించే ప్రభుత్వాల ఉదాసీన వైఖరి ప్రస్తుతం దేశంలో డ్రగ్స్ వాడకాన్ని, వ్యాపారాన్ని కూడా పెంచిపోషిస్తోంది. డ్రగ్స్‌కి అలవాటు పడిన వారు చేసే విపరీతాలకి నేడు సమాజం భారీ మూల్యం చెల్లించుకుంటోంది. తమని తాము నాశనం చేసుకోవడంతో ప్రారంభమయ్యే ఈ వ్యసనం, మొదట కుటుంబాన్ని, తరువాత సమాజాన్ని, చివరికి దేశాన్ని నాశనం చేస్తోంది. డ్రగ్స్ వ్యసనానికి అలవాటు పడుతున్న వారిలో కలిగే శారీరక, మానసిక రుగ్మతలు,

అన్ని వయసుల వారు వినియోగించేంత సులభంగా తయారవుతున్న దీని రూపాలు తెలుసుకుని జాగ్రత్తపడడం ఇప్పుడు మనముందు ఉన్న తక్షణ కర్తవ్యం. 'ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ చీఫ్స్ ఆఫ్ పోలీస్' మాదకద్రవ్యాలని ప్రధానంగా ఏడు రూపాలుగా చెప్పింది. సిఎన్ఎస్ డిప్రెస్సంట్లు, సిఎన్ఎస్ స్టిమ్యులంట్లు, హాలుక్యినోజెన్‌లు, డిస్అసోసియేటివ్ అనస్థెటిక్స్, నార్కోటిక్ అనాల్జెసిక్స్, ఇన్‌హేలంట్స్ రూపాల్లో ఉన్న డ్రగ్స్ శరీర అవయవాలపై వివిధ రూపాల్లో దాడి చేస్తాయని వైద్యులు చెబుతున్నారు.

సిఎన్ఎస్ డిప్రెస్సంట్లు మెదడు, శరీరం పని తీరుని మందగించేలా చేస్తాయి. ఎన్ఎస్ స్టిమ్యులంట్లు గుండె కొట్టుకునే వేగాన్ని పెంచి రక్తపోటు పెరిగేలా చేస్తాయి. లేదా శరీరానికి ఉద్రేకాన్ని కలిగిస్తాయి. కొకైన్, ఆంఫెటామైన్లను, మేథాఫెటామైన్లు కూడా ఈ జాబితాలో ఉంటాయి. హాలుక్యినోజెన్‌లు వాస్తవ పరిస్థితికి భిన్నంగా ఆలోచించేలా ప్రేరేపిస్తాయి. దీని తీవ్ర రూపం అంటే డెలీరియం దశకి చేరుకున్న తరువాత రాత్రికి, పగలకి కూడా తేడా తెలియదు. డిస్అసోసియేటివ్ అనస్థెటిక్స్, నార్కోటిక్ అనాల్జెసిక్స్ వాడకం వల్ల నొప్పి తెలియకుండా చేస్తాయి. భావోద్వేగాల నియంత్రణ చేసుకోలేరు. ఓపియం (నల్ల మందు), కొకైన్, హెరాయిన్, డెమెరాల్,డార్వోన్, మార్ఫిన్, మేథాడోన్, వికోడిన్, ఆక్సీకోన్టిన్ డ్రగ్స్ ఈ తరహావి.

**వివిధ రూపాల్లో..:** సాధారణంగా సిగరెట్లతో పాటు తీసుకునే కొకైన్, గంజాయి, కూల్‌డ్రింక్స్‌తో కలిపి తీసుకునే టాబ్లెట్లు, ద్రవ రూపంలో దొరికే ఎల్ఎస్‌డీ (లైసెర్జిక్ యాసిడ్ డైథ్లమైడ్) ట్యాబ్లెట్లని ఉద్రేకాలని పెంచేందుకు వినియోగిస్తుంటారు. ఇక పార్టీలప్పుడు ఎండిఎంఎ మిథలీన్ డైఆక్సీ మేథామ్ఫెటామైన్‌ని వాడతారు.

మాదకద్రవ్యాలు ఆరోగ్యాన్ని ఎలా దెబ్బతీస్తున్నాయో అనే విషయంపై ప్రముఖ వైద్య నిపుణులు ప్రస్తావించిన, హెచ్చరించిన అంశాలని ప్రముఖ వార్తా పత్రికలు కొంతకాలంగా ప్రచురిస్తున్నాయి.

గంజాయిని హషీష్, చరస్, హై-పొటెన్సీ వీడ్ వంటి రూపాల్లో విక్రయిస్తున్నారు. వీటి వాడకం వల్ల జ్ఞాపకశక్తి తగ్గడం, చురుకుదనం తగ్గిపోవడం, ఆందోళన, భయం పెరగడం, దీర్ఘకాలంలో మెదడు పనితీరు పూర్తిగా నియంత్రణ కోల్పోయే ప్రమాదం ఉంటుంది. వాస్తవానికి, కల్పితాలకి మధ్య తేడా గుర్తించలేకపోవడం పెరుగుతుందని కూడా ప్రస్తావించారు. గంజాయి వాడకం ప్రస్తుతం 15-20 ఏళ్లల్లోనే విస్తరిస్తోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**సింథటిక్ డ్రగ్స్ :** ఈ రూపాన్ని తాజాగా అత్యంత ప్రమాదకరమైనదిగా గుర్తించారు. ఇవి రసాయనిక పద్ధతుల్లో తయారవుతాయి, ప్రభావం అధికంగా ప్రమాదం తీవ్రంగా ఉంటుంది.

ఎండిఎంఎ, మెఫెడ్రోన్, ఫెంటని1, క్రిస్టల్ మెథ్ (ఐస్), కీటామైన్, సింథటెక్ కాథినోన్స్ రూపంలో లభించే వీటిని వాడడం వల్ల గుండెపోటు ప్రమాదం, శరీర ఉష్ణోగ్రత 41 డిగ్రీ సెల్సియస్ నుండి 42 డిగ్రీ సెల్సియస్‌కి పెరగడం, మెదడు పనితీరు తక్షణ ధ్వంసం, నరాల వ్యవస్థపై శాశ్వత నష్టం కలుగుతుంది. ఒక్కసారి వాడినా మరణించే అవకాశాలు (ప్రత్యేకించి ఫెంటని1) ఉన్నాయని జాతీయ పత్రికలు ఈ విషయంపై వరుస కథనాలు ప్రచురించాయి.

**మెదడు రసాయనాల నాశనం :** డ్రగ్స్ వల్ల శరీర నాడీ వ్యవస్థలో ఉన్న డోపమైన్, సెరోటోనిన్, నోరెపినెఫ్రైన్ వంటి రసాయనాల సమతుల్యత పూర్తిగా దెబ్బతింటుంది. ఈ ప్రభావం వల్ల అకస్మాత్తుగా కోపం, విచిత్ర ప్రవర్తన, డిప్రెషన్-ఆందోళన, భావోద్వేగ నియంత్రణ కోల్పోవడం, నిర్ణయశక్తి తగ్గిపోవడం వంటి అంశాలని తరచూ పత్రికలు ప్రస్తావిస్తున్నాయి. సింథటిక్ ఎండిఎంఎ, క్రిస్టల్ మెథ్ (ఐస్), కొకైన్ లాంటి స్టిమ్యులంట్లుహఠాత్తుగా హృదయ స్పందన వేగాన్ని పెంచుతాయి. శరీరం భరించలేని వేడి పుడుతుంది. రక్తపోటు మామూలు స్థాయిలో ఉండదు. ఈ కారణాల వల్ల ఒక్కసారిగా మూర్ఛ రావడం, మరణం సంభవిస్తుంది అని 'ద హిందూ', 'టైమ్స్ నౌ'లో ఎన్నో కథనాలు వచ్చాయి.

**పునరుత్పత్తి వ్యవస్థ నష్టం :** ఆరోగ్య పత్రికలు ఎక్కువగా ఈ అంశంపై కథనాలు ప్రచురిస్తున్నాయి. పురుషుల్లో స్పెర్మ్ కౌంట్ తీవ్రంగా తగ్గడం, మహిళల్లో హార్మోన్ల అస్థిరత, గర్భధారణ సమస్యలు, జనన లోపాలు వస్తున్నాయి.

**డ్రగ్స్ వల్ల పిచ్చి దుశ్చర్యలు :** ప్రత్యేకించి ఎల్ఎస్‌డి, మెథ్, హై-థెక్, కానాబీస్, మెఫెడ్రోన్ వాడినప్పుడు ఎక్కడి నుండో శబ్దాలు వస్తున్నట్లు భ్రమిస్తారు. ఎవరో వెంటపడుతున్నట్టు భయపడతారు. ఈ పరిస్థితి ఆత్మహత్యకో, హింసాత్మక ప్రవర్తనకో దారితీస్తుంది. ఈ అంశాలపై 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' స్పెషల్ రిపోర్ట్స్ పలు కథనాలు ప్రచురించింది.

**అవయవాల మొత్తం దెబ్బతినడం :** లివర్ ఫైబ్రోసిస్, కిడ్నీ వైఫల్యం, ఊపిరితిత్తుల నష్టం, గుండె పనితీరు దెబ్బతినడం, రక్తనాళాలకి ప్రమాదం వాటిల్లుతుంది. ప్రతి డ్రగ్ ఒక్కో అవయవాన్ని ఒక్కో విధంగా దెబ్బతీస్తుందని అనేక తాజా వైద్య నివేదికలు సూచిస్తున్నాయి.

**నాడీ వ్యవస్థపై ప్రభావం:** డ్రగ్స్‌కి అలవాటు పడిన వారిలో అధికంగా 'మల్టీపుల్ స్లెరోసిస్' ముప్పు కనిపిస్తుంది. నాడీ వ్యవస్థపై ఈ ప్రభావం నేరుగా ఉంటుంది. ఫలితంగా నాడీ వ్యవస్థని కాపాడే రోగనిరోధక శక్తి క్రమంగా తగ్గిపోతుంది. దీంతో పలు రకాల వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లు సోకే అవకాశాలు ఉంటాయి.

**నరాలు దెబ్బతినడం :** నరాల ఫైబర్ (నరాల కణంలో దారం పోగులా ఉండే భాగం) చుట్టూ ఉండే ఫాట్‌షీత్‌కి నష్టం కలుగుతుంది. దీనివల్ల కణాలకి విద్యుత్ ప్రేరణ ప్రసార సామర్థ్యం (ఎలక్ట్రికల్ ఇంపలెన్స్) తగ్గి నరాలు దెబ్బతింటాయి. శరీరంలో ఒక్కో డ్రగ్ ఒక్కో విధంగా ప్రభావం చూపుతుంది. కొన్నింటి వల్ల గుండెపోటు, బ్రెయిన్‌స్ట్రోక్ వస్తుంది. ఊపిరితిత్తులపై ప్రభావం చూపడం వల్ల శ్వాససమస్యలు వస్తాయి. కేంద్ర నాడీ వ్యవస్థ దెబ్బతినడం వల్ల శరీరంలోని అన్ని ప్రధాన అవయవాలు దెబ్బతిని ప్రాణాలకు ప్రమాదం ఉంటుంది.

**వినియోగం పెరుగుతోంది:** యుఎన్ఒడిసి (యునైటెడ్ నేషన్ ఆఫీస్ అండ్ డ్రగ్స్ అండ్ క్రైమ్) నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 2023 నాటికి 35 కోట్లకు పైగా వ్యక్తులు డ్రగ్స్ వినియోగదారులుగా పరిగణించారు. వీరిలో 60 లక్షల మందికి పైగా మరణించారు. దేశంలో డ్రగ్స్ వ్యసనానికి ఎక్కువగా యువత గురవుతున్నారు. 3.2 కోట్ల మంది (15-35 ఏళ్ల మధ్య) ఉన్నారు. డ్రగ్స్ వల్ల ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా 6 లక్షల మంది చనిపోతున్నారు. అలాగే డ్రగ్స్ అక్రమ రవాణా చేస్తున్న వారిలో ప్రతి 10 మందిలో ముగ్గురు మహిళలు ఉంటున్నారు.

దేశంలో డ్రగ్ వినియోగం 18-30 ఏళ్ల యువ తలో ఎక్కువగాఉంది. గంజాయి,బ్రౌన్ షుగర్,డ్రగ్‌మిక్స్ చేసిన ఇంజెక్ష న్లు ఎక్కువగా వాడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. పాఠశాలలు, కాలేజీ స్థాయిల్లోనే గంజాయి వాడకం పెరిగిందని 2024లో నార్కోటి క్స్‌లో పెరిగిన కేసులని బట్టి అంచనా వేయవచ్చు. పై అంశాలని బట్టి, డ్రగ్స్ వాడకం కేవలం ఆరోగ్య సమస్యగా కాదు.. మానసిక, సామాజిక, ఆర్థిక సంక్షోభానికి ప్రతిరూపంగా చూడాలి. అవగాహన, అప్రమత్తత చర్యలు వేగవంతమే దీని నివారణకి పరిష్కారం.

## పాకిస్తాన్ కు చుక్కలు చూపిస్తున్న బెలూచిస్తాన్

న్యూఢిల్లీ: బలూచిస్తాన్.. పాకిస్తాన్ నుంచి విడిపోయి స్వతంత్రంగా ఉండాలని కోరుకుంటోంది. ఇది పాకిస్తాన్‌లో అతిపెద్ద రాష్ట్ర జనాభా తక్కువగా ఉన్నా.. విస్తీర్ణం పరంగా 45 శాతం ఉంటుంది. అభివృద్ధికి దూరంగా ఉంటున్న ఇక్కడి ప్రజలు స్వతంత్ర దేశం కోసం పోరాడుతున్నారు. పాకిస్తాన్ ప్రభుత్వంపై, సైన్యంపై బలూచ్ లిబరేసన్ ఆర్మీ (బీఎల్ఏ)పేరుతో తిరుగుబాటు చేస్తున్నారు. దాడులు చేస్తున్నారు. విధ్వంసం సృష్టిస్తున్నారు. తాజాగా గడచిని 27 గంటల్లో 48 దాడులు చేశారు. దీంతో పెద్ద ఎత్తున ప్రభుత్వ ఆస్తులు ధ్వంసమయ్యాయి. కమ్యూనికేషన్ వ్యవస్థ ధ్వంసమైంది. 29 మంది పాకిస్తాన్ సైనికులు మరణించారు.ఇక పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్‌లో అరుదైన మినరల్స్ కోసం అమెరికా, చైనా పోటీ పడుతున్నాయి. పాకిస్తాన్ సైనికుల అనుమతితో ఇరు దేశాలు మైనింగ్ నిర్వహిస్తున్నా యి. దీనికి సంబంధించిన ప్రధాన కార్యాలయంపై బలూచ్ యువతి ఆత్మాహుతి దాడి చేసింది. కీలక మినరల్స్ స్థావరం ధ్వంసమైంది. బీఎల్ఏ గెరిల్లా ఆర్మీ ఇద్దరు చైనీయులను కిడ్నాప్ చేసింది. మరో గని సమీపంలో 15 మందిని ఎత్తుకెళ్లారు. ఇక ఈ ఏడాది ఇప్పటి వరకు జఫర్ ఎక్స్‌ప్రెస్‌పై ఆరుసార్లు బీఎల్ఏ దాడి చేసింది.చైనా పాకిస్తాన్‌లో తమ పౌరుల భద్రతపై ఆందోళన వ్యక్తం చేసి ఏరియల్ సర్వేలు చేపట్టింది. పాకిస్తాన్ సైన్యం, ప్రభుత్వం అధికారిక ప్రకటనలు జారీ చేయకపోవడం ఆశ్చర్యకరం. సీపీఈసీ ప్రాజెక్టులపై దాడులు పాక్‌చైనా సంబంధాలను ప్రభావితం చేస్తున్నాయి. మరోవైపు కిడ్నాప్‌ల వెనుక అమెరికా హస్తం ఉందని చైనా అనుమానిస్తోంది. పాకిస్తాన్ సహకారం తో ఈ కిడ్నాప్‌లు జరిగాయని భావిస్తోంది.బీఎల్ఏ చైనీయుల విడుదలకు డిమాండ్లు పెడుతోంది, పాకిస్తాన్ బలహీన స్థితిలోకి చిక్కుకుంది. ఈ సంఘటనలు బలూచిస్తాన్ విభజనవాదాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయి. మరోవైపు ఈ దాడులు, కిడ్నాప్‌లపై పాకిస్తాన్ ప్రభుత్వం, ఆర్మీ నుంచి ఎలాంటి ప్రకటన రావడం లేదు. నాయకులు మాట్లాడడం లేదు.

# పెన్షన్ కోసం లంచాలు?

**అదిలాబాద్,తెలంగాణ దిశ :** ఆసరా కోసం దివ్యాంగుల సంఘం నాయకులను సంప్రదిస్తే సాయం చేయాల్సిన నేతలే చేతివా టం ప్రదర్శిస్తూ అంది నంత దోపిడీ చేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తున్నాయి దివ్యాంగుల హక్కుల కోసం సంఘాన్ని ఏర్పాటు కొందరు లీడర్లు సంఘం పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతూ అమాయక దివ్యాంగులను బురి డీ కొట్టించి ప్రభుత్వ సంక్షేమ పథకాల పేరుతో మోసం చేస్తున్నారని పలువురు ఆరోపిస్తు న్నారు. నిర్మల్ జిల్లాలోని నిర్మల్, బైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీలతోపాటు 18మండలాల్లో సుమారు 18,856 మంది దివ్యాంగులు ఉండగా అందులో 10,548 దివ్యాం గులు ప్రభుత్వం పెన్షన్ వస్తుంది. దివ్యాంగు ల సంక్షేమం వారి హక్కుల సాధనకు జిల్లాలో దివ్యాంగుల సంక్షేమ సంఘాలను కొందరు నేతలు ఏర్పాటు చేసుకుని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. జిల్లాలో మొత్తం 11 సంఘాలు ఉండగా ఏడు సంఘాలు ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు దివ్యాంగుల సంక్షే మం కోసం పాటుపడుతున్నామంటూ గొప్ప లు చెప్పుకొని సంక్షేమం పేరుతో అక్రమవస్తులకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు వస్తు న్నాయి.ప్రతినెల సమావేశాలు నిర్వహించుకుంటూ ప్రెస్ నోట్లను రిలీజ్ చేస్తూ తమ సం ఘం దివ్యాంగుల కోసం కృషి చేస్తుందని ఆర్భాటాలు బాటలు చెప్పిన నాయకులు అమాయక దివ్యాంగుల అవసరాలను ఆసరా గా చేసుకుని ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలను తాము చెప్పిన వారికే పథకాలు వర్తి స్తాయని నమ్మబలికి వారి వద్ద నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఈనెల 3న జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో కార్యాలయంలో మంజులాపూర్‌కు చెందిన పోశవ్వ దివ్యాంగుల సంఘంలో పనిచేస్తున్న శివ అనే వ్యక్తిని పింఛన్ కోసం 7000 వసూ లు చేయగా పెన్షన్ రాకపోవడంతో కాలర్ పట్టి నిలదీసిం ది. లోకేశ్వరం మండలం ధర్మవరం చెందిన ఓ కుటుంబం ట్రై సైకిల్ కోసం పది వేలు లంచం అడిగినట్టు ఆరోపించింది. సారంగాపూర్ మండలంలోని పారమూరుకు చెందిన దంపతులకు పెన్షన్ కోసం ఓ వ్యక్తికి రూ.5000 ఇవ్వగా రెండేళ్ల నుంచి పెన్షన్ మంజూరు కాలేదు.నిర్మల్ జిల్లాలో దివ్యాంగుల సంక్షేమానికి ఏర్పడ్డ సంఘాలు కొందరు నేతలు సంఘం పేరుతో అమాయక దివ్యాంగులను సంక్షేమ పథకాల పేరుతో అక్రమ వాసులకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం దివ్యాంగులకు ప్రతినెల 3,016 పెన్షన్ ఇవ్వడం దివ్యాంగులకు ప్రభుత్వ పథకాలైన రేషన్ కార్డులు ఇండ్ల స్థలా లు ఇండ్లు డబుల్ బెడ్ రూములు స్వయం ఉపాధి పథకాలు వినికిడి యంత్రాలు రైస్ సైకి ల్లు చదువుకునే వారికి నగదు ప్రోత్సాహం దివ్యాంగులైన పెళ్లి చేసుకునే వారికి రెండు లక్ష ల ఆర్థిక సాయం. బ్యాక్లాగ్ పోస్టుల భర్తీ తదిత ర పథకాలను అమలు చేస్తుంది.దివ్యాంగుల చట్టం ప్రకారం ప్రతి పథకంలో దివ్యాంగులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పిస్తోంది. దివ్యాంగుల సదర సర్టిఫికెట్ కో సం దివ్యాంగులైన వారు ఆధార్ కార్డుతో మీ సేవ కేంద్రంలో స్లాట్ బుకింగ్ చేసుకొని ఆసుపత్రిలో నిర్వహించే క్యాంపుకు హాజరైతే వైద్యుల పరీక్ష అనంతరం అంగవైకల్యం సర్టిఫికెట్ జారీ అవుతుంది. ఇది ఎవరు పోయిన సాధారణంగా జరిగే కార్యక్రమం. కొందరు సంఘ నాయకులు తాము చెప్తేనే స్లాట్ బుకింగ్ అయితదని డాక్ట ర్ సర్టిఫికెట్ ఇస్తారని పెన్షన్ కూడా ఆన్లైన్లో తాము చెప్పిన పేర్లే ఎంట్రీ అవుతాయని నమ్మబలికి పది వేల నుంచి 15 వేల వరకు వసూలు చేస్తున్నారు. రేషన్ కార్డులు ఇందిరమ్మ స్థలాలు ఉచిత డబ్బులు బెడ్ రూమ్ ప్రభుత్వ దివ్యాంగుల లోన్లు వెనికిడి పరికరా లు రైస్ సైకిల్లు ప్రభుత్వం దివ్యాంగులకు ఏ పథకం అమలు చేయాలని తమ సంఘం సిఫార్సు చేసిన వ్యక్తులకే మంజూరవుతాయని అమాయక దివ్యాంగులను నమ్మించి వారి వద్ద ఆ పనిని బట్టి ఐదు వేల నుంచి 20 వేల వరకు వసూలు చేస్తున్నారు. దివ్యాంగులు కార్యాలను చుట్టూ తిరిగి పరిస్థితి లేకపోవడంతో సంఘాల నేతలకు పనులను అప్పగిస్తున్నారు. కొందరు లీడర్లు అయితే సదరన్ క్యాంపుల్లో వైద్యులు అక్కడ సిబ్బందిపై ఒత్తిడి తెచ్చి తప్పుడు ధృవీకరణ పత్రాలు జారీ చేయించి వారి వద్ద నుంచి రూ.30 వేల నుంచి 40,000 వరకు వసూలు చేస్తున్నారని విమర్శలు వినవస్తున్నా యి. అయితే దివ్యాంగులు ప్రభుత్వ నిబంధనల అర్హతలు ఉన్నవా రికి ఎవరి ప్రమేయం లేకుండా ప్రభుత్వ పథకాలు అందుతుండగా వాటిని తామే మం జూరు చేయించామని చెబుతూ మిగతా వారి ని బుట్టలు వేసుకుంటున్నారు.ఒక సంఘం వారితో పని జరగకపోతే మరో సంఘాన్ని ఆశ్రయిస్తున్నారు అక్కడ కూడా ఇదే పరిస్థితి తలుచు తోంది. ఓ మహిళ ప్రభుత్వ పెన్షన్ కో సం దివ్యాంగుల సర్టిఫికెట్ తీసుకున్నందుకు మూడు సంఘాల ముఖ్య నాయకులకు సుమారు రూ.18000 డబ్బులు ఇచ్చిన ఇంతవరకు పని జరగలేదని సమావేశం లోనే ఆవేద న వ్యక్తం చేసింది.

ఇదంతా నిర్మల్ జిల్లాలో బహిరంగ గా జరుగుతున్న తతంగం అయినప్పటికీ దివ్యాంగుల వైద్యుల సంక్షేమ శాఖ పట్టించుకోకపోగా, సంఘ నేతలను సమావేశాల్లో కుర్చీలో కూర్చోబెట్టడంపై విమర్శలు వస్తున్నాయి. ప్రతినెలా సమావేశాలు అంటూ సభ్యత్వం పేరుతో కొన్ని సంఘాలు రూ.100 వసూలు చేసి ఆ పైసలను సొంతగా వాడుకుంటున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.నిర్మల్ జిల్లాలో కొన్ని దివ్యాంగుల సంక్షేమ సంఘాల నేతలు అక్రమ వాసులపై ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో జిల్లా అధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. దివ్యాంగుల సంక్షేమానికి నిర్మల్ జిల్లా లో జిల్లా వయోవృద్ధుల దివ్యాంగుల సంక్షేమ శాఖ పనిచేస్తుంది. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే దివ్యాంగులకు ప్రభుత్వ పథకాల అమ ల్లో చైతన్యం కల్పించాలి. సదరం స్లాట్ బుకింగ్ వైద్య పరీక్షల విభాగంలో పారదర్శకత పాటించాలి. సంఘ నేతలు సిఫార్సు చేస్తే వాస్తవాలను క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వారికి ఆ పథకం వర్తించే విధంగా చూడాలి.అక్రమల వసూళ్లకు పాల్పడుతున్న నేతలపై ఫిర్యాదు వచ్చిన వెంటనే విచారణ జరిపి ఆధారాలు లభిస్తే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటే మిగతా వారికి భయం ఉంటుంది. సంఘాల నేతల సిఫారసు ఆధారంగా ఇప్పటికే నిర్మల్ జిల్లాలో 10,548 పెన్షన్లలో 2000పైగా సదరం సర్టిఫికెట్లు అర్హత లేకున్నా జారీ చేసినట్టు సంఘ నేతలే పేర్కొంటున్నారు. వీటిపై విచారణ జరిపి తొలగించాలి.

# కోతుల సమస్యకు పరిష్కారం!



**హైదరాబాద్,తెలంగాణ దిశ :**చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి రైతులను ఇబ్బంది పెడుతున్న కోతుల బెడద సమస్యకు వినూత్న పరిష్కారంతో ముందుకు వచ్చారు. "రైతుల కోసం.. కోతులను పట్టుకుందాం" అనే నినాదంతో ఆయనఒక ప్రత్యేక వాహనాన్ని రూపొందించారు. ఈ వాహనం గ్రామాల్లోకి వెళ్లి కోతులను బంధిస్తుంది. గత పదేళ్లలో ప్రభుత్వం కోతుల సమస్యను పరిష్కరించలేకపోయిందని విమర్శిం చిన ఎంపీ, ఈ ప్రత్యేక వాహనం ద్వారా పట్టుకున్న కోతులను వికారాబాద్ జిల్లా పరిధిలోని అటవీ ప్రాంతాల్లో వదిలివేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఎంపీ తీసుకున్న ఈ చర్యపై ప్రజల నుంచి ప్రశంసలు వస్తున్నాయితెలంగాణ రాష్ట్రంలో రైతులను, ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్న కోతుల బెడద సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడానికి చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఒక వినూత్నమైన ఆలోచనతో ముందుకు వచ్చారు. "రైతుల కోసం.. కోతులను పట్టుకుందాం" అనే నినాదంతో ఆయన ప్రారంభి ంచిన ఈ ప్రత్యేక కార్యక్రమంపై స్థానిక ప్రజల నుంచి, ముఖ్యంగా రైతుల నుంచి విశేష ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. కోతుల సమస్య దేశవ్యాప్తంగా ఉందని... తాను పార్లమెంట్‌లో కూడా ఈ అంశాన్ని ప్రస్తావించినా.. ఏ శాఖ కూడా దీనిపై చర్యలు తీసుకుంటా మని చెప్పలేదని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.తెలంగాణలో దాదాపు 30 లక్షలకు పైగా కోతులు ఉన్నాయని అంచనా. గత పదేళ్లలో (2014 నుంచి) రెండు ప్రభు త్వాలు కేవలం వందల్లో మాత్రమే కోతులను పట్టుకోగలిగాయని.. ఇది సమస్య తీవ్రతకు నిదర్శనమని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వా లు సమస్యను పట్టించుకోకపోవడంతో.. తానే స్వయంగా రంగంలోకి దిగి ఈ సమస్య పరిష్కారానికి ఒక ప్రత్యేక వాహనాన్ని రూపొందించినట్లు వివరించారు.ఈ ప్రత్యేక వాహనం వికారాబాద్ జిల్లా కేంద్రంలో ప్రారంభించబడింది. ఈ వాహనం కోతుల బెడద ఎక్కువగా ఉన్న గ్రామాల్లోకి వెళ్లి శాస్త్రీయ పద్ధతిలో కోతులను బంధిస్తుంది. పట్టుకున్న కోతులను జిల్లా కలెక్టర్ సూచించిన విధంగా అటవీ ప్రాంతాల్లో సురక్షితంగా వదిలివేస్తామని ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి రైతులకు హామీ ఇచ్చారు. ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయం రైతాంగానికి ఎంతో ఊరట కలిగించే అంశంగా మారింది. కోతులు పంటలను, పండ్లను నాశనం చేయడంతో రైతులు భారీగా నష్టపోతున్నారు.వ్యక్తిగతంగా ఒక ప్రజాప్రతినిధి ఈ సమస్యను పరిష్కరించడానికి ముందుకు రావడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే.. కొంతమంది రైతులు గతంలో కూడాప్రైవేట్ వ్యక్తులు డబ్బులు తీసుకుని ఇలా కోతులను పట్టినప్పటికీ.. కొన్ని రోజులకే మరో కోతుల గుంపు గ్రామంలోకి వస్తోందని వాపోతున్నారు. ఈ నేపథ్యంలో.. ఎంపీ తీసుకున్న ఈ చర్య కోతుల సంఖ్యను నియంత్రించడానికి, బెడదను శాశ్వతంగా నివారించడానికి ఎంతవరకు దోహదపడుతుందో చూడాలి.

# పరగడుపునే బెల్లం నీళ్లను తాగితే ఇన్ని ఉపయోగాలు ఉన్నాయా..?



బెల్లాన్ని సహజసిద్ధమైన పద్ధతిలో తయారు చేస్తారన్న విషయం అందరికీ తెలిసిందే. అందుకనే తీపి తినాలనుకునే వారు చక్కెరకు బదులుగా బెల్లం తింటే మంచిదని వైద్య నిపుణులు కూడా చెబుతుంటారు. అయితే రోజూ బెల్లం తినడం కష్టం అనుకునే వారు బెల్లాన్ని నీటిలో కలిపి కూడా తాగవచ్చు. ఈ విధంగా బెల్లం నీళ్లను తాగడం వల్ల కూడా మనకు ఎంతో మేలు జరుగుతుందని అంటున్నారు. చిన్న బెల్లం ముక్కను రాత్రి పూట ఒక గ్లాస్ నీటిలో నానబెట్టాలి. మరుసటి రోజు ఉదయం పరగడుపునే ఆ నీళ్లను సేవించాలి. దంతాలను తోముకున్న తరువాతే ఈ నీళ్లను తాగాలి. ఉదయం బెల్లం నీళ్లను సేవిస్తే శరీరానికి శక్తి లభిస్తుంది. రోజంతా ఉత్సాహంగా ఉంటారు. చురుగ్గా పనిచేస్తారు. శరీరంలో శక్తి స్థాయిలు పెరుగుతాయి. నీరసం, అలసట ఉండవు.


రోగాల నుంచి రక్షణ..: బెల్లం నీళ్లను తాగడం వల్ల జీర్ణ వ్యవస్థ శుభ్రంగా మారుతుంది. జీర్ణాశయంలో ఎంజైమ్ ఉత్పత్తి పెరుగుతుంది. దీంతో తిన్న ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. జీర్ణక్రియ మెరుగు పడుతుంది. మలబద్దకం తగ్గుతుంది. బెల్లం నీళ్లను తాగడం వల్ల లివర్ శుభ్రంగా మారుతుంది. లివర్‌లోని వ్యర్థాలు, టాక్సిన్లు బయటకు పోతాయి. లివర్‌లోని కొవ్వు కరుగుతుంది. ఫ్యాటీ లివర్ ఉన్నవారు బెల్లం నీళ్లను తాగుతుంటే ఫలితం ఉంటుంది. బెల్లంలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్‌తో పోరాటం చేస్తాయి. కణాలు దెబ్బ తినకుండా చూస్తాయి. దీంతో క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. బెల్లంలో అనేక యాంటీ ఆక్సిడెంట్లతోపాటు మినరల్స్ కూడా ఉంటాయి. ఇవి రోగ నిరోధక వ్యవస్థను బలంగా మారుస్తాయి. దీంతో రోగాల నుంచి రక్షణ లభిస్తుంది.

రక్తహీనతకు ఔషధం..: బెల్లంలో ఉండే ఐరన్, ఫోలేట్ మహిళలకు ఎంతో మేలు చేస్తాయి. వారిలో నెలసరి సమయంలో వచ్చే నొప్పులను తగ్గిస్తాయి. తీవ్ర రక్త స్రావం జరగకుండా చూస్తాయి. అలాగే ఈ నీళ్లను తాగడం వల్ల రక్తం వృద్ధి చెందుతుంది. రక్తహీనత తగ్గుతుంది. బెల్లంలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. దీంతో బీపీ తగ్గుతుంది. హైబీపీ ఉన్నవారికి ఈ నీళ్లు ఎంతో మేలు చేస్తాయి. అలాగే బెల్లం నీళ్లను తాగితే శరీర మెటబాలిజం పెరుగుతుంది. క్యాలరీలు ఖర్చయి కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. బెల్లం నీళ్లను తాగడం వల్ల లభించే మినరల్స్ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. చర్మం కాంతివంతంగా మారి మెరిసేలా చేస్తాయి.

రాత్రి కూడా తాగవచ్చు..: బెల్లం నీళ్లను ఉదయం తాగడం వీలు కాదు అనుకునే వారు రాత్రి పూట భోజనం చేసిన తరువాత లేదా నిద్రకు ముందు తాగవచ్చు. అయితే బెల్లం శరీరంలో వేడిని పెంచుతుంది. కనుక బెల్లం నీళ్లను చల్లగా తాగితే మేలు. ఈ నీళ్లను తాగితే కొందరికి పడకపోవచ్చు.

విరేచనాలు అయ్యే అవకాశాలు ఉంటాయి. అలాంటి వారు ఈ నీళ్లను తాగకపోవడమే మంచిది. నాణ్యమైన బెల్లంతో తయారు చేసిన నీళ్లనే తాగాలి. బెల్లం క్వాలిటీగా లేకపోయినా కూడా అనారోగ్య సమస్యలు వస్తాయి. శారీరక శ్రమ లేదా వ్యాయామం చేసేవారు పని ముగిసిన తరువాత బెల్లం నీళ్లను తాగితే శరీరానికి శక్తి లభిస్తుంది. మళ్లీ ఉత్సాహంగా మారుతారు. ఇలా బెల్లం నీళ్లను సేవించడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

# గుండె ఇలా పదిలం



గుండె ఆరోగ్యం కోసం రాత్రికి రాత్రే జీవితాన్ని పూర్తిగా మార్చుకోవాల్సిన అవసరం లేదు. చిన్నచిన్న, స్థిరమైన మార్పులు.. మీ హృదయాన్ని రక్షించడంలో సహాయపడతాయి. అందుకోసం కింది చిట్కాలను పాటిస్తే సరి.. క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి. ప్రతిరోజూ కనీసం 30 నిమిషాల నడక.. గుండె ఆరోగ్యాన్ని రెట్టింపు చేస్తుంది. నాలుకకు నచ్చేలా కాదు.. .

మనసుకు నచ్చేలా తినండి. జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉంటూ.. కూరగాయలు, తృణధాన్యాలు, ఆరోగ్యకరమైన కొవ్వులకు ఆహారంలో చోటివ్వండి. నిద్రకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వండి. ప్రతిరోజూ రాత్రిపూట 7 నుంచి 9 గంటల నాణ్యమైన నిద్ర ఉండేలా చూసుకోండి. ధూమపానం, మద్యపానం అలవాటు ఉంటే.. వెంటనే మానేయండి. ఇంట్లో ఎవరైనా ధూమపానం చేస్తుంటే.. వారికి దూరంగా ఉండాలి. ఒత్తిడి, భావోద్వేగాలను నియంత్రణలో ఉంచుకోవడానికి యోగా, ధ్యానం లాంటివి ప్రయత్నించండి.

# ఈ బెర్రీలను ఎప్పుడైనా తిన్నారా..?

## వీటితో కలిగే లాభాలు తెలిస్తే షాకవుతారు..!

బెర్రీలు.. ఈ పండ్ల పేరు చెప్పగానే మనకు స్ట్రాబెర్రీలు, క్రాన్ బెర్రీలు, బ్లూబెర్రీల వంటి పండ్లు గుర్తుకు వస్తాయి. కానీ బెర్రీల్లో ఇంకా అనేక వెరైటీలు ఉన్నాయి. వాటిల్లో రొవాన్ బెర్రీలు కూడా ఒకటి. ఇవి చూసేందుకు చిన్నపాటి చెర్రీ పండ్ల మాదిరిగా ఉంటాయి. ఇవి మనకు ఎక్కువగా సూపర్ మార్కెట్లలోనే లభిస్తాయి. రొవాన్ బెర్రీలను డ్రై ఫ్రూట్స్ రూపంలోనూ విక్రయిస్తారు. అయితే రొవాన్ బెర్రీలలో పారాసోర్బిక్ యాసిడ్ ఉంటుంది. కనుక ఈ పండ్లను నేరుగా తినకూడదు. కాస్త ఉడకబెట్టి లేదా డ్రై ఫ్రూట్స్ రూపంలో తినాలని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఈ పండ్లను నేరుగా తింటే పొట్టలో అసౌకర్యం ఏర్పడుతుందని అంటున్నారు. ఇక రొవాన్ బెర్రీలను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక లాభాలు ఉంటాయని వారు అంటున్నారు.

డయాబెటిస్ ఉన్నవారికి వరం..: రొవాన్ బెర్రీలలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను బలంగా మారుస్తుంది. రోగ నిరోధక శక్తి పెరిగేలా చేస్తుంది. దీంతో శరీరం వ్యాధులను సమర్థవంతంగా ఎదుర్కొంటుంది. అలాగే ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. రొవాన్ బెర్రీలలో పాలిఫినాల్స్, ఫ్లేవనాయిడ్స్, కెరోటినాయిడ్స్ అనే యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గేలా చేస్తాయి. దీంతో క్యాన్సర్, గుండె జబ్బులు రాకుండా అడ్డుకోవచ్చు. రొవాన్ బెర్రీలలో సార్బిటాల్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది ఆల్కహాల్‌కు చెందిన ఒక సమ్మేళనం. ఇది షుగర్ లెవల్స్ తగ్గేలా చేస్తుంది. మధుమేహం ఉన్నవారు రొవాన్ బెర్రీలను తింటుంటే షుగర్ లెవల్స్‌ను తగ్గించుకోవచ్చు. ఈ బెర్రీలు తియ్యగా ఉన్నప్పటికీ వీటిల్లో ఉండే సార్బిటాల్ కారణంగా వీటిని తింటే షుగర్ లెవల్స్ పెరగవు. పైగా షుగర్ లెవల్స్ తగ్గేలా చేస్తాయి. కనుక డయాబెటిస్ ఉన్నవారికి ఈ పండ్లను వరంగా చెప్పవచ్చు.

మలబద్దకానికి ఔషధం..: రొవాన్ బెర్రీలు సహజసిద్ధమైన లాక్సేటివ్ గుణాలను కలిగి ఉంటాయి. అందువల్ల ఈ పండ్లను తింటే మలబద్దకం తగ్గుతుంది. జీర్ణ వ్యవస్థ శుభ్రంగా మారుతుంది. రొవాన్



బెర్రీలలో ఫినోలిక్స్, టెర్పినాయిడ్స్ అనే బయో యాక్టివ్ సమ్మేళనాలు ఉంటాయి. ఇవి యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలను కలిగి ఉంటాయి. దీని వల్ల ఆర్థరైటిస్ నొప్పులు, వాపుల నుంచి ఉపశమనం లభిస్తుంది. కీళ్ల నొప్పులు ఉన్నవారు ఈ పండ్లను తింటుంటే ఎంతో ఉపశమనం లభిస్తుంది. రొవాన్ బెర్రీలలో యాంటీ మైక్రోబియల్ గుణాలు ఉంటాయి. అందువల్ల ఈ పండ్లను తింటే మన శరీరంలో చేరే బ్యాక్టీరియా, వైరస్, ఫంగస్‌లు నిర్మూలించబడతాయి. ముఖ్యంగా ఇ.కోలి వంటి బ్యాక్టీరియా నాశనం అవుతుంది. దీంతో అనేక వ్యాధుల రాకుండా సురక్షితంగా ఉండవచ్చు.

వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి..: రొవాన్ బెర్రీలలో కెరోటినాయిడ్స్ అధికంగా ఉంటాయి. లుటీన్ అధికంగా ఉంటుంది. దీని వల్ల కంటి ఆరోగ్యం మెరుగు పడుతుంది. కంటి చూపు పెరుగుతుంది. వయస్సు మీద పడడం వల్ల కళ్లలో వచ్చే శుక్లాలు రాకుండా అడ్డుకోవచ్చు. రొవాన్ బెర్రీలలో విటమిన్ సి, ఫ్లేవనాయిడ్స్ అధికంగా ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి కొల్లాజెన్ ఉత్పత్తి అయ్యేలా చేస్తాయి. దీంతో చర్మంపై ఉండే ముడతలు, మచ్చలు, వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. చర్మం కాంతివంతంగా మారి మెరుస్తుంది. యవ్వనంగా కనిపిస్తారు. రొవాన్ బెర్రీలను ఆహారంలో భాగం చేసుకుంటే వాపులు తగ్గుతాయి. దీంతో గొంతు, ఊపిరితిత్తుల్లో ఉండే కఫం కరిగిపోతుంది. ముక్కు దిబ్బడ తగ్గుతుంది. ఇలా రొవాన్ బెర్రీలను తరచూ తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.


# సంతాన సఫలతకు వడదెబ్బ

మాతృత్వ మాధుర్యాన్ని కోరుకునే స్త్రీలకు హీట్‌వేవ్ (వడగాలి) ఉపద్రవంలా మారింది. విపరీతమైన ఎండ మహిళల పునరుత్పత్తి ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని, వేడి వాతావరణం, వడగాలుల కారణంగా మానసికంగా, శారీరకంగా స్త్రీలలో ఒత్తిడి పెరుగుతున్నట్టు వైద్యులు చెబుతున్నారు.

అధిక ఉష్ణోగ్రతలకు ఎక్కువసేపు గురికావడం వల్ల కార్టిసాల్ వంటి ఒత్తిడిని పెంచే హార్మోన్ల ఉత్పత్తి పెరగడం, స్త్రీలలో ఈస్ట్రోజెన్, ప్రొజెస్టిరాన్ వంటి హార్మోన్లపై ప్రభావం చూపుతున్నట్టు పేర్కొంటున్నారు. ఈ హార్మోన్ల అసమతుల్యత కారణంగా రుతుక్రమ సమస్యలు ఉత్పన్నమవుతున్నట్టు చెప్పారు. దీని ప్రభావం అండాల విడుదల (ఓవులేషన్)పై పడుతున్నదని.. ఈ రెండు అంశాలు గర్భధారణకు సవాలుగా మారుతున్నట్టు వెల్లడించారు. వేసవిలో జరిగే ఈ మార్పులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉంటే ఇంబాలెన్సెస్ (అసమానతల)ను గుర్తించవచ్చని వైద్యులు అంటున్నారు.

వేసవిలో శరీరం నుంచి చెమట ద్వారా ఎక్కువ ఫ్లూయిడ్స్‌ను కోల్పోతారు. కాబట్టి, ఎప్పటికప్పుడు శరీరానికి అవసరమైన ద్రవ పదార్థాలను తగిన మొత్తంలో తీసుకోవాలని సూచిస్తున్నారు. వీర్యం అండాన్ని చేరడానికి సహాయపడే గర్భాశయ శ్లేష్మం హైడ్రేషన్‌పైనే ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. శ్లేష్మం తక్కువగా ఉన్నా.. లేదా మందంగా ఉన్నా.. అది వీర్యం కదలికకు ఆటంకం కలిగిస్తుందని తెలిపారు. గర్భధారణ కోరుకునే మహిళలు వడగాలుల సమయంలో ప్రతీరోజు 8 నుంచి 10 గ్లాసుల నీరు తప్పనిసరిగా తాగడం ద్వారా సంతాన సామర్థ్యం పెరుగుతుందని వైద్యులు సూచిస్తున్నారు.


నిద్ర, పౌష్టికాహారంc పునరుత్పత్తికి దోహదపడే హార్మోన్లను నియంత్రించే ప్రక్రియలో నిద్ర కీలక పాత్ర వహిస్తుంది. అయితే, వేసవిలో స్త్రీలకు తగినంత నిద్రపట్టడం కష్టంగా మారుతుంది. నిద్రలేమి కారణంగా మెలటోనిన్ అనే హార్మోన్ స్థాయి తగ్గి అది అండాల విడుదలపై ప్రభావితం చూపుతుందని వైద్యులు తెలిపారు. అందుకే నిద్రపోయేటప్పుడు యూవీ కిరణాలు, సూర్యకాంతి, వేడిని నిరోధించే బ్లాక్ అవుట్ కర్టెన్లు, కాటన్ బెడ్‌షీట్లతోపాటు గది చల్లగా



ఉండేలా చూసుకోవాలి. సంతానోత్పత్తికి కంటినిండా నిద్ర కీలకమని సూచిస్తున్నారు. వేసవిలో ప్రయాణాలు కూడా కొన్నిసార్లు రుతుచక్రాన్ని దెబ్బతీస్తాయని.. ప్రయాణాలతో కలిగే ఒత్తిడి కూడా అండాల విడుదలపై ప్రభావం చూపుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వడగాలుల సమయంలో వేడి కారణంగా ఆకలి తగ్గుతుంది. దీంతో కొన్నిసార్లు తక్కువ పోషక పదార్థాలు ఉన్న ఆహారాన్ని తీసుకుంటారు. సంతానోత్పత్తి పౌష్టికాహారంపై ఆధారపడి ఉంటుంది కాబట్టి, స్త్రీలు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలని సూచిస్తున్నారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి: ఫోలిక్ యాసిడ్, ఐరన్, జింక్, ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు వంటి ముఖ్యమైన పోషకాలు ఆరోగ్యకరమైన అండాల అభివృద్ధికి దోహదపడతాయి. అందువల్ల, ఆయా కాలాల్లో లభించే పండ్లు, ఆకుకూరలు, తృణధాన్యాలు, లీన్ ప్రొటీన్లు ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. హైడ్రేటింగ్ సమస్యలను తప్పించుకోవడానికి కొబ్బరినీళ్లు క్రమం తప్పకుండా తాగాలి. వేసవిలో ఎండవేడి మానసిక ఆరోగ్యంపై సైతం ప్రభావితం చూపుతుంది. గర్భందాల్చడానికి ప్రయత్నిస్తున్న స్త్రీలు అప్పటికే భావోద్వేగ ఒత్తిడికి లోనవుతారు. అదనంగా వేసవి కారణంగా ఈ ఒత్తిడి మరింత పెరుగుతుంది. ఇలాంటప్పుడు సోషల్ మీడియాకు దూరంగా ఉండటం, మానసిక ప్రశాంతతకు ప్రాధాన్యం ఇవ్వాలని వైద్యులు చెబుతున్నారు. ఎండలో బయటికి వెళ్లినప్పుడు సన్‌స్క్రీన్ లోషన్లు తప్పనిసరిగా వాడాలని, హైడ్రేటెట్‌గా ఉండాలని సూచించారు.

# ఈ చిట్కాలను పాటిస్తే మీ పెదవులు సహజసిద్ధంగా పింక్ రంగులోకి



చర్మం, శిరోజాల తరువాత చాలా మంది అందంగా కనిపించాలని కోరుకునే అవయవాల్లో పెదవులు మూడో స్థానంలో ఉంటాయని చెప్పవచ్చు. మహిళలు ఎక్కువగా పెదవుల అందానికి ప్రాధాన్యతను ఇస్తుంటారు. పెదవులు అందవిహీనంగా కనిపిస్తే ఎవరికీ మనశ్శాంతిగా ఉండదు. పెదవులు పొడిబారడం లేదా నల్లగా మారడం, కాంతిని కోల్పోవడం వంటివి జరుగుతుంటాయి. ఇందుకు అనేక కారణాలుఉంటాయి. అయితే పెదవుల అందానికి ఖరీదైన బ్యూటీ పార్లర్ చికిత్సలు అవసరం లేదు. మన ఇంట్లోఉండే పదార్థాలతోనేఅత్యంత సహజసిద్ధం గా పెదవులను అందంగా మార్చుకోవచ్చు. అందుకు ఏం చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం. పెదవులను అందంగా మార్చడంలో చక్కెర, తేనె ఎంతగానో ఉపయోగపడతాయి. రెండింటినీ కలిపి పేస్ట్‌లా చేసి పెదవులపై మసాజ్ చేసినట్లు రాయాలి. దీంతో మృత చర్మ కణాలు పోతాయి. పెదవులు కాంతివంతంగా మారి అందంగా కనిపిస్తాయి. ఈ చిట్కాను వారంలో 2 సార్లు పాటించాలి. తేనె..: పెదవులను అందంగా మార్చడంలో కొబ్బరినూనె కూడా పనిచేస్తుంది. ఈ నూనెను చాలా మంది శిరోజాల సంరక్షణకు ఉపయోగిస్తుంటారు. కానీ కొబ్బరినూనెను రాయడం వల్ల పెదవులు కూడా అందంగా మారి రక్షించబడతాయి. రాత్రి పూట నిద్రకు ముందు కొద్దిగా కొబ్బరినూనెను పెదవులకు మసాజ్ చేసినట్లు రాయాలి.

ఉదయం కడిగేయాలి. ఇలా చేస్తుంటే పెదవులు మృదువుగా మారుతాయి. సహజసిద్ధమైన నిగారింపును పొందుతాయి.

పెదవులు పొడిబారడం తగ్గుతుంది. తేనె పెదవులకు తేమను అందిస్తుంది. తేనెను కొద్దిగా తీసుకుని పెదవులకు రాసి 20 నిమిషాలు అయ్యాక కడిగేయాలి. రోజూ ఇలా చేస్తుంటే పెదవులు అందంగా మారుతాయి. పెదవులపై ఉండే నలుపు దనం పోతుంది. మృత చర్మ కణాలుతొలగిపోయిపెదవులు కాంతివంతంగా కనిపిస్తాయి.

బీట్ రూట్ జ్యూస్..: పెదవులపై బీట్‌రూట్ జ్యూస్‌ను అప్లై చేయడం వల్ల కూడా ఫలితం ఉంటుంది. కొద్దిగా బీట్ రూట్ జ్యూస్‌లో ముల్లంగి రసం కలిపి పెదవులపై రాసి 15 నిమిషాలు అయ్యాక కడిగేయాలి. రోజూ ఇలా చేస్తుంటే మీ పెదవులపై ఉండే నలుపుదనం తగ్గిపోతుంది. మీ పెదవులు సహజసిద్ధంగా పింక్ రంగులోకి మారుతాయి. కలబంద గుజ్జును కొద్దిగా తీసుకుని పెదవులపై రాసి 15 నిమిషాలు అయ్యాక కడిగేయాలి. కలబందలో ఉండే యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు పెదవుల వాపులను తగ్గించి ఇన్‌ఫెక్షన్లను దూరం చేస్తాయి. దీంతో పెదవులు సహజసిద్ధమైన నిగారింపును పొందుతాయి. రాత్రి పూట పెదవులపై కాస్త నెయ్యిని రాసి ఉదయం కడిగేస్తున్నా కూడా ఫలితం ఉంటుంది. అయితే నెయ్యిని ఉపయోగించే ముందు కాస్త వేడి చేస్తే మంచిది. పాలు, గులాబీల మిశ్రమం..: రాత్రంతా గులాబీ పువ్వుల రెక్కలను పాలలో వేసి నానబెట్టాలి. మరుసటి రోజు ఉదయం ఆ మిశ్రమాన్ని మెత్తని పేస్ట్‌లా చేయాలి. దాన్ని పెదవులపై రాయాలి. 15 నిమిషాలు అయ్యాక కడిగేయాలి. ఇలా రోజూ చేస్తుంటే పెదవులు పింక్ రంగులోకి సహజసిద్ధంగా మారిపోతాయి. రాత్రి పూట నిద్రకు ముందు పెదవులపై బాదంనూనెను రాస్తున్నా ప్రయోజనం ఉంటుంది. పెదవులు సురక్షితంగా ఉంటాయి.

# పాదాలు పదిలం



శరీరంలో అన్ని భాగాలపై దాడి చేసే వ్యాధి డయాబెటిస్. ఈ వ్యాధి కారణంగా రక్తంలో ఉండే అధిక చక్కెర స్థాయిలు కండ్లు, కిడ్నీలు, గుండె ఆరోగ్యాన్ని కూడా ప్రభావితం చేస్తాయి. అయితే, ఈ అవయవాలు మాత్రమే కాదు మధుమేహ వ్యాధిగ్రస్తుల పాదాలకు కూడా ముప్పు పొంచి ఉంటుంది. మధుమేహ వ్యాధిగ్రస్తుల్లో పాదాల సమస్యలు చాలానే ఉంటాయి. దీన్నే డయాబెటిక్ ఫూట్ అంటారు. ఈ సమస్యకు నిర్ణీత సమయంలో చికిత్స తీసుకోకపోతే పాదాల్లో పుండ్లు (అల్సర్లు) ఏర్పడతాయి. కాబట్టి, పొరపాటున కూడా డయాబెటిక్ ఫూట్ లక్షణాలను ఏమాత్రం నిర్లక్ష్యం చేయకూడదు.

నిజానికి మధుమేహ: వ్యాధిగ్రస్తుల్లో అధిక చక్కెర స్థాయిలు కాలక్రమంలో నాడులను ధ్వంసం చేస్తాయి. దీన్ని డయాబెటిక్ న్యూరోపతి అని పిలుస్తారు. ఈ పరిస్థితిలో పాదాలకు తగినంతగా రక్త ప్రసారం జరగదు. దీంతో పాదాల్లో నొప్పి, గాయాలను గుర్తించడం కష్టమైపోతుంది. కొన్నిసార్లు ఈ గాయాలు తీవ్రమైన ఇన్ఫెక్షన్లకు దారితీస్తాయి. అవి తగ్గడానికి చాలా సమయం పడుతుంది కూడా!

లక్షణాలు: పాదాలు, వేళ్ల దగ్గర తిమ్మిర్లు, మొద్దుబారినట్టు ఉండటం. కాళ్లలో మంట లేదంటే తీవ్రమైన నొప్పి. తొందరగా నయం కాని పుండ్లు, బొబ్బలు. ఎక్కడో ఓ చోట గాయం. పాదాల చుట్టూతా ఎర్రగా కందిపోవడం, వాపు. పాదాల్లో పగుళ్లు, పొడి చర్మం, రక్తస్రావం. చర్మంపై గాఢమైన నల్లటి మచ్చలు. గాయం నుంచి దుర్వాసన, రసి కారడం. పాదాల్లో ఏదైనా అవకరం.

నివారణ ఎలా?: పాదాలను శుభ్రంగా, పొడిగా ఉంచుకోవాలి. గోళ్లు కత్తిరించుకుని, శుభ్రంగా ఉంచుకోవాలి. పాదాలపై పులిపిర్లు, గాయాలు, మంటగా ఉండటం లాంటివాటిని గమనిస్తూ ఉండాలి. పాదాలను గోరువెచ్చటి నీటితో కడుక్కోవాలి.

వేళ్ల మధ్య భాగాన్ని పొడిగా ఉంచుకోవాలి. పాదాలకు అసౌకర్యంగా ఉండని తగిన షూస్‌నే ధరించాలి. ధూమపానం చేయొద్దు. ఉట్టి కాళ్లతో నడవకూడదు. వీటికి అదనంగా రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుకోవాలి. చక్కెర స్థాయిలను క్రమం తప్పకుండా పరీక్షించుకుంటూ ఉండాలి. వైద్యుడి సలహాలను అనుసరించాలి.

# రూ.7 లక్షల కోట్లు ఆవిరి




- దలాల్ స్ట్రీట్‌కు ఎఫ్ఐఐ సెగలు
- సెన్సెక్స్ 600 పాయింట్ల పతనం
- ఇండిగో షేర్ల కుదేలు

ముంబయి : భారత స్టాక్ మార్కెట్లపై విదేశీ మదుపర్లు ముఖం చాటేస్తోన్నారు. వరుస అమ్మకాలతో దలాల్ స్ట్రీట్‌కు సెగలు పుట్టిస్తున్నారు. రూపాయి రికార్డ్ పతనం, భారత్ %-% అమెరికా వాణిజ్య ఒప్పందంపై సానుకూల సంకేతాలు కానరాకపోవడం, విదేశీ సంస్థాగత మదుపర్ల (ఎఫ్ఐఐ) అమ్మకాలతో సోమవారం సెన్సెక్స్, నిఫ్టీలు కుప్పకూలాయి. బిఎస్ఇ సెన్సెక్స్ రోజంతా నష్టాల్లోనే కొనసాగి.. తుదకు 610 పాయింట్లు లేదా 0.71 శాతం పతనమై 85,103కు పరిమితమైంది. ఎన్ఎస్ఇ నిఫ్టీ కూడా 226 పాయింట్లు లేదా 0.86 శాతం కోల్పోయి 25,961 వద్ద ముగిసింది. సెన్సెక్స్ ఓ దశలో 800 పాయింట్లకు పైగా నష్టపోయింది. బిఎస్ఇలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ దాదాపు రూ.7 లక్షల కోట్లపైగా ఆవిరై రూ.463 లక్షల కోట్లకు తగ్గింది. దీంతో ఒక్కపూటలోనే ఇన్వెస్టర్ల సంపద రూ.7 లక్షల కోట్లు కరిగిపోయినట్లయ్యింది. సెన్సెక్స్ 30 సూచీలో టెక్ మహీంద్రా, రిలయన్స్, హెచ్‌డిఎఫ్‌సి మినహా మిగిలిన 27షేర్లూ ప్రతికూలతను చవిచూశాయి. బిఇఎల్, ఎటెర్నెల్, ట్రెంట్, టాటా స్టీల్, బజాజ్ ఫైనాన్స్ స్టాక్స్ అధికంగా నష్టపోయాయి. యుఎస్ ఫెడ్ ఈ నెల 10న వడ్డీ రేట్లను తగ్గించ నుందనే అంచనాలతో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. భారత ఈక్విటీ మార్కెట్ల నుంచి శుక్రవారం ఒక్క పూటలోనే రూ.439 కోట్లను ఉపసంహరించుకోగా.. డిసెంబర్‌లో ఇప్పటివరకు రూ.6,584 కోట్ల విలువైన స్టాక్స్‌ను తరలించుకుపోయారు. ఇది మార్కెట్లపై మరింత ఒత్తిడిని పెంచిందని నిపుణులు భావిస్తున్నారు. ఇండిగోలో నెలకొన్న సంక్షోభంతో దాని మాతృసంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ లిమిటెడ్ షేర్లు స్టాక్ మార్కెట్లలో భారీగా క్షీణించాయి. ఇప్పటికే గత ఐదు సెషన్లలో 9 శాతానికి పైగా నష్టపోగా.. సోమవారం సెషన్‌లో ఏకంగా 8.28 శాతం లేదా రూ.444.75 నష్టంతో రూ.4,926.55 వద్ద ముగిసింది.

# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు...!



న్యూఢిల్లీ: రూపాయి బలహీనత ఎఫెక్ట్‌తో బంగారం, వెండి ధరలు భగభగ మండిపోతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా బంగారం ధరలు లక్షా 30 వేల మార్క్ దాటి పరుగులు పెడుతున్నాయి.. ఇటీవల తగ్గినట్లే తగ్గిన పసిడి ధరలు.. మళ్లీ పెరుగుతూ రికార్డు స్థాయికి చేరుకుంటుండటంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. అంతర్జాతీయంగా బంగారం ధరలు పెరుగుతుండటంతో.. దేశీయంగా కూడా పెరుగుతున్నాయని బులియన్ మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. తాజాగా.. గోల్డ్ ధర తగ్గగా.. సిల్వర్ ధరపెరిగింది.. పలు వెబ్‌సైట్ల ఆధారంగా.. నమోదైన ధరల ప్రకారం.. దేశీయంగా బంగారం, వెండి రేట్లు ఈ కింది విధంగా ఉన్నాయి. హైదరాబాద్‌లో బంగారం 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,30,090 ఉంది.. 22 క్యారెట్ల గోల్డ్ 10గ్రాముల ధర రూ.1,19,250 ఉంది. వెండి కిలో ధర రూ.1,99,000 ఉంది. విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల పసిడి 10 గ్రాముల ధర రూ.1,30,090, 22 క్యారెట్ల ధర రూ. 1,19,250 ఉంది. కిలో వెండి ధర రూ.1,99,000 ఉంది. ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,30,240, 22 క్యారెట్ల ధర రూ.1,19,400 గా ఉంది. వెండి కిలో ధర రూ.1, 90,000 ఉంది. ముంబైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,30,090, 22 క్యారెట్ల ధర రూ.1,19,250 గా ఉంది. వెండి కిలో ధర రూ.1,90,000 లుగా ఉంది. చెన్నైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,30,910.. 22 క్యారెట్ల ధర రూ.1,20,000 ఉంది. వెండి కిలో ధర రూ.1,99,000 లుగా ఉంది. బెంగళూరులో 24 క్యారెట్ల ధర రూ.1,30,090, 22 క్యారెట్లు రూ.1,19,250 గా ఉంది. వెండి కిలో ధర రూ.1,90,000 లుగా ఉంది. కాగా.. బంగారం, వెండి ధరలు అన్ని నగరాల్లో ఒకే విధంగా ఉండవు. స్థానిక డిమాండ్, సరఫరా, అలాగే రాష్ట్ర పన్నులు, తదితర అంశాల ప్రకారం ఎప్పటికప్పుడు మారుతుంటాయి.. అందుకే అన్ని ప్రధాన నగరాల్లో కూడా ధరల్లో వ్యత్యాసాలు ఉంటాయి. ఒకవేళ మీకు బంగారం, వెండి ధరల లేటెస్ట్ అప్‌డేట్ గురించి తెలుసుకోవాల ంటే ఈ మొబైల్ నెంబర్‌కు 8955664433కు మిస్డ్ కాల్ ఇవ్వవచ్చు.




# తెలంగాణ రాష్ట్ర రహదారుల్లో సరికొత్త శకం



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణలో రవాణావ్యవస్థను మెరుగుపరిచేం దుకు కీలకమైన హైదరాబాద్ - విజయవాడ నేషనల్ హైవేను 8లైన్ల రహదారిగా విస్తరించాలని ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఈ భారీ ప్రాజెక్టు అంచనా వ్యయం సుమారు రూ. 10,400 కోట్లుగా ఉంది. ప్రస్తుతం దీనికి సంబంధించి డీపీఆర్ తయారీ జరుగుతోంది. డీపీఆర్ ఖరారైన తర్వాత నిధులు మంజూరై.. నిర్మాణ పనులు వేగవంతంఅవుతాయి. ఈ విస్తరణతో రెండు రాష్ట్రాల మధ్య ప్రయా ణసమయం తగ్గి, ట్రాఫిక్ రద్దీ సమస్య తీరుతుందని.. వాణిజ్య సం బంధాలు మెరుగుపడతాయని అధికారులు భావిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర రహదారుల రంగంలో సరికొత్త శకం మొదలుకానుంది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతిని.. తెలంగాణ రాజధాని హైదరాబాద్‌ను కలిపే కీలకమైన 'జాతీయ రహదారి 65 (ఔఊ-65)'పై భారీ ప్రాజెక్టుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. రవాణా రంగానికి జీవనాడిగా భావించే హైదరాబాద్ - విజయవాడ నేషనల్ హైవేను ఏకంగా 8 లైన్ల రహదారిగా విస్తరించడానికి రంగం సిద్ధమవుతోంది. ఈ మెగా ప్రాజెక్టు అంచనా వ్యయం దాదాపు రూ. 10,400 కోట్లుగా ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం నాలుగు లైన్లుగా ఉన్న ఈ రహదారిని ఎనిమిది లైన్ల వరకు విస్తరించడం ద్వారా ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది. అంతేకాక.. ఈ మార్గంలో తరచూ ఎదురయ్యే ట్రాఫిక్ రద్దీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది.ప్రస్తుతం ఈ ప్రాజెక్టుకు సంబంధించి వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక సిద్ధమవుతోంది. డీపీఆర్ ఖరారు అయిన వెంటనే.. జాతీయ రహదారుల సంస్థ లేదా కేంద్ర ప్రభుత్వం నుంచి నిధుల మంజూరు చేయడంతో... సాంకేతిక ఆమోదం లభిస్తుంది. సాంకేతిక అనుమతులు లభించిన వెంటనే.. ప్రాజెక్టును టెండరింగ్ ప్రక్రియ ద్వారా నిర్మాణ సంస్థలకు అప్పగిస్తారు. ఆ తర్వాత.. భూసేకరణ వంటి అంశాలను పూర్తి చేసి యుద్ధ ప్రాతిపదికన నిర్మాణ పనులు మొదలుపెట్టనున్నారుఇదిలా ఉండగా.. తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ నూతన ప్రాజెక్టుల నిర్మాణంలో రికార్డులను సృష్టిస్తూ వేగంగా దూసుకుపోతోంది. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలను సైతం హైదరాబాద్‌తో అనుసంధానిం చాలనే లక్ష్యంతో కొత్త జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారుల నిర్మాణాలను, ఉన్న రహదారుల విస్తరణ పనులను వేగవంతం చేస్తున్నారు. హైదరాబాద్ - విజయవాడ కారిడార్ విస్తరణతో ఈ మార్గంలో పరిశ్రమలు, లాజిస్టిక్స్ హబ్‌లు మరియు ఇతర వ్యాపార కార్యకలాపాలు పెరిగే అవకాశం ఉంది. ఇది రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, ఉపాధి అవకాశాల కల్పనకు దోహదపడుతుంది. ఎనిమిది లైన్ల రహదారి వలన హైదరాబాద్ నుండి విజయవాడకు ప్రయాణించే ప్యాసింజర్ వాహనదారులు, అలాగే వస్తు రవాణా చేసే లారీలు వేగంగా.. సురక్షితంగా గమ్యస్థానాన్ని చేరుకోగలుగుతారు. తద్వారా.. ఇరు రాష్ట్రాల మధ్య వాణిజ్య సంబంధాలు మరింత మెరుగుపడతాయి.

# సౌదీలో మద్యం అమ్మకాలపై నిబంధనల సడలింపు




న్యూఢిల్లీ సౌదీ అరేబియా ప్రభుత్వం మద్యం అమ్మకాల విషయంలో మరో కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలో నివసిస్తున్న ముస్లిమేతర విదేశీయులకు మద్యం కొనుగోలు చేసేందుకు మరిన్ని సడలింపులు ఇచ్చింది. నెలకు 50,000 రియాళ్లు (సుమారు 13,300 డాలర్లు) లేదా అంతకంటే ఎక్కువ జీతం ఉన్నవారు ఇప్పుడు మద్యం కొనుగోలు చేయవచ్చు. ఈ నిబంధన ప్రకారం, అర్హులైన విదేశీయులు తమ జీతం వివరాలను ధ్రువీకరించే సర్టిఫికెట్‌ను చూపించి, రాజధాని రియాద్‌లో ఉన్న ఏకైక మద్యం విక్రయ కేంద్రంలోకి ప్రవేశం పొందాల్సి ఉంటుంది. గత ఏడాది విదేశీ దౌత్యవేత్తల కోసం ప్రారంభమైన ఈ స్టోర్‌లోకి, ఇప్పుడు 'ప్రీమియం రెసిడెన్సీ' హోదా కలిగిన ముస్లిమేతరులకు కూడా ప్రవేశం కల్పించారు. నెలవారీ పాయింట్ల ఆధారిత కోటా పద్ధతిలో ఇక్కడ అమ్మకాలు జరుగుతాయి. విదేశీ నిపుణులను, పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలనే లక్ష్యంతో సౌదీ ప్రభుత్వం ఈ సామాజిక సంస్కరణలను చేపడుతోంది. రియాద్‌ను అంతర్జాతీయ వ్యాపార కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నాల్లో భాగంగానే ఈ సడలింపులు ఇస్తున్నట్లు తెలుస్తోంది. గత కొన్నేళ్లుగా సౌదీలో మహిళల డ్రైవింగ్‌పై నిషేధం ఎత్తివేయడం, సినిమా థియేటర్లు, వినోద కార్యక్రమాలకు అనుమతివ్వడం వంటి అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. రియాద్‌తో పాటు దేశంలోని మరో రెండు నగరాల్లో కూడా కొత్త మద్యం దుకాణాలను ఏర్పాటు చేయబోతున్నట్టు సమాచారం.

## కాశ్మీర్‌లో చైనా జాతీయుడి అరెస్ట్..

న్యూఢిల్లీ: వీసా నిబంధనలను ఉల్లంఘించి, ఎలాంటి అనుమతి లేకుండా కశ్మీర్, లడఖ్‌లలోని అత్యంత కీలకమైన, సున్నితమైన ప్రాంతాల్లో పర్యటించిన చైనా జాతీయుడిని శ్రీనగర్‌లో అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్‌ను ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపారు. దేశ భద్రతకు సంబంధించిన సున్నిత సమాచారాన్ని ఏమైనా లీక్ చేశాడా? అనే కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. వివరాల్లోకి వెళితే, హూ కాంగ్‌తాయ్ (29) అనే చైనా పౌరుడు నవంబర్ 19న టూరిస్ట్ వీసాపై ఢిల్లీకి వచ్చాడు. నిబంధనల ప్రకారం వారణాసి, ఆగ్రా, జైపూర్, గయ వంటి కొన్ని బౌద్ధ క్షేత్రాలను మాత్రమే అతను సందర్శించాలి. కానీ అతడు ఫారినర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్‌లో నమోదు చేసుకోకుండానే లడఖ్‌లోని లేహ్, జన్స్కర్‌తో పాటు కశ్మీర్ లోయలోని పలు వ్యూహాత్మక ప్రాంతాల్లో పర్యటించాడు. జన్స్కర్ లో మూడు రోజుల పాటు ఉండి, స్థానిక బౌద్ధారామాలతో పాటు వ్యూహాత్మకంగా ముఖ్యమైన ప్రదేశాలను సందర్శించాడు. దక్షిణ కశ్మీర్ లోని ఆర్మీ విక్టర్ ఫోర్స్ హెడ్ క్వార్టర్స్‌కుసమీపంలో ఉన్న అవంతిపుర బౌద్ధ శిథిలాలతో పాటు హజ్రత్‌బల్ దర్గా, శంకరాచార్య హిల్, దాల్ సరస్సు వంటి ప్రాంతాల్లో అతడి కదలికలు అనుమానాలకు తావిచ్చాయి.

భారత్‌కు వచ్చిన వెంటనే బహిరంగ మార్కెట్‌లో ఒక ఇండియన్ సిమ్ కార్డును కూడా సంపాదించడం గమనార్హం. అతడి ఫోన్‌లోని బ్రౌజింగ్ హిస్టరీలో సీఆర్పీఎఫ్ మోహరింపు, ఆర్టికల్ 370 రద్దు వంటి అంశాల గురించి వెతికినట్లు అధికారులు గుర్తించారు. విచారణలో తాను అమెరికాలోని బోస్టన్ యూనివర్సిటీలో ఫిజిక్స్ చదివానని, గత తొమ్మిదేళ్లుగా అక్కడే ఉంటున్నానని హూ కాంగ్‌తాయ్ తెలిపాడు. తనకు ప్రయాణాలంటే ఇష్టమని, వీసా నిబంధనల ఉల్లంఘన గురించి తనకు తెలియదని చెబుతున్నాడు. అతడిని ప్రస్తుతం శ్రీనగర్ ఎయిర్‌పోర్ట్ సమీపంలోని బుద్గాం జిల్లా హుమ్హామా పోలీస్ పోస్టులో విచారిస్తున్నారు. అతడి పర్యటన వెనుక అసలు ఉద్దేశాన్ని రాబట్టేందుకు భద్రతా ఏజెన్సీలు ప్రయత్నిస్తున్నాయి.

## చైనాలో రోబో ట్రాఫిక్ పోలీస్



బీజింగ్, : చైనాలో ట్రాఫిక్ నియంత్రణకు సరికొత్త విధానం అమల్లోకి వచ్చింది. కూడళ్లలో వాహనాల రద్దీని నియంత్రించేం దుకు అధికారులు రోబో ట్రాఫిక్ పోలీసులను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఏఐ టెక్నాలజీతో పనిచేసే రోబో పోలీస్ వాహనదారులకు తగిన సూచన లు, హెచ్చరికలు చేస్తుంది. ఎవరైనా తన మాట వినకపోతే సమీపంలో ఉన్న పోలీసులను రోబో అలర్ట్ చేస్తుంది. దీంతో వారు అక్కడికి చేరుకుని చర్యలు తీసుకుంటారు. ఇప్పటికే చైనాలోని టెక్నాలజీ హబ్ అయిన పై రోబో ట్రాఫిక్ పోలీస్‌లు కనిపిస్తున్నాయి. ఇప్పుడు చైనా మీడియాలో ఏఐ టెక్నాలజీతో తయారు చేసిన హ్యూమనాయిడ్ రోబో పోలీస్ చర్చనీయాంశంగా మారింది. 1.8 మీటర్ల ఎత్తు కలిగిన రోబో అచ్చంగా నిజమైన ట్రాఫిక్ పోలీస్ తరహాలోనే రద్దీ రోడ్లపై నిల్చుకుని వాహనదారులకు సూచనలు ఇస్తుంది.

# 37 మంది ఎమ్మెల్యేలు మారలేదు..


**విజయవాడ,తెలంగాణ దిశ :**ఎమ్మెల్యేల పనితీరుపై సీఎంనారా చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. వన్ టూ వన్ భేటీల తర్వాత ఎమ్మెల్యే పనితీరు మెరుగైందని చంద్రబాబు అన్నారు. 37 మంది శాసనసభ్యులు మినహా మిగతా అందరి పనితీరు మెరుగుపడిందని.. ఓ 37మంది ఎమ్మెల్యేల పనితీరు ఇంకా మెరుగుపడాల్సి ఉందన్నారు. ప్రతి ఎమ్మెల్యే పనితీరుపైనా సర్వే నివేదికలు తెప్పించుకుంటున్నానన్న చంద్రబాబు.. పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు. టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో టీడీపీ నేతలతో చంద్రబాబు భేటీ అయ్యారు. తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు. బీజేపీ కోసం ఆర్ఎస్ఎస్ ఎలా నిస్వార్థంగా పనిచేస్తేందో.. అదే తరహాలో ఓ సిద్ధాంతం ప్రకారం పార్టీ క్యాడర్‌ను సంసిద్ధం చేసుకోవాలని నేతలకు సూచించారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీరుపైనా చంద్రబాబు చర్చించారు. వైఎస్ జగన్ అర్థం పర్థం లేకుండా మాట్లాడే మాటలు పట్టించుకోవద్దని సూచించారు. విజ్ఞత కోల్పోయి మాట్లాడుతున్న మాటలకు విలువ లేదన్న చంద్రబాబు.. ప్రజలే వారికి బుద్ధి చెబుతారని అన్నారు. మీడియాతో చిట్ చాట్ సందర్భంగా సీఎం చంద్రబాబు తిరుమల పరకామణి కేసుపై కీలక వ్యాఖ్యలు చేశారు. పరకామణిలో రూ.70వేల చోరీ చేసి.. రూ.14కోట్ల ఆస్తి రాసిచ్చేందుకు సిద్ధమయ్యారంటే ఎంత సంపాదించి ఉండొచ్చని చంద్రబాబు ప్రశ్నించారు. పరకామణి కేసులో వైఎస్ జగన్ శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడారని చంద్రబాబు విమర్శించారు.

వైఎస్ జగన్‌కు దేవుడు అన్నా, భక్తుల మనోభావాలు అన్నా పట్టింపు లేదని.. దొంగతనాన్ని కూడా తప్పు కాదనే వాళ్లను ఏమనాలని చంద్రబాబు ప్రశ్నించారు. నేరస్తుల్ని వెనకేసుకొస్తూ సమాజానికి ఏం సందేశం ఇస్తున్నారని మండిపడ్డారు. తిరుమల శ్రీవారి భక్తులు, ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారని చంద్రబాబు అన్నారు. మరోవైపు ఏపీలో లేడీ డాన్ల వ్యవహారం చర్చనీయాంశమవు తున్న వేళచంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. నెల్లూరులో అరుణ, అరవ కామాక్షి వ్యవహారం చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో లేడీ డాన్ల విషయంపై చంద్రబాబు మీడియాతో చిట్ చాట్ సందర్భంగా స్పందించారు. వైసీపీ హయాంలో నెల్లూరులో మాఫియా చాపకింద నీరులా విస్తరించిందని ఆరోపించారు. లేడీ డాన్లు తయారు కావటం ఆశ్చర్యమేసిందన్న చంద్రబాబు..నేరాలకు పాల్పడే వారి తోకలు కట్ చేస్తామని హెచ్చరించారు.అమరావతిలో సమస్యలు పరిష్కారమై ప్రశాంతంగా ఉంటే.. కొంతమంది తట్టుకోలేక పోతున్నారన్న చంద్రబాబు... రాజకీయం చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇక టీడీపీ హయాంలో హైదరాబాద్ అభివృద్ధి చెందిందన్న వాస్తవాన్ని తెలంగాణలో అధికారంలో ఉన్న పార్టీలు కూడా గుర్తిస్తున్నాయన్న చంద్రబాబు.. పరోక్షంగా కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేసినవ్యాఖ్యలపై స్పందించారు. ఏపీలో జోనల్ వ్యవస్థ: ఏపీ సమగ్రాభివృద్ధి కోసం ప్రత్యేకంగా జోన్ వ్యవస్థను తీసుకొస్తామని చెబుతున్నారు. బాబు నో మూడు జోన్లు అన్న మాట రావడంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. గతంలో వైసీపీ తెచ్చిన మూడు రాజధానుల ఫార్ములాకు కౌంటర్‌గానే జోన్ స్లోగన్ అందుకున్నారన్న టాక్ వినిపిస్తోంది. మళ్లీ ఫ్యూచర్‌లో కూడా ఆర్థిక, న్యాయ, పరిపాలనా రాజధాని అని లేనిపోని రచ్చ లేకుండా..డెవలప్‌మెంట్ మోడల్‌తో జోన్ సిస్టమ్‌కు ప్రపోజల్ రెడీ చేస్తున్నారట. అభివృద్ధి కోసమే జోన్ వ్యవస్థ అని బాబు చెప్తున్నప్పటికీ..వైసీపీని పూర్తిగా కార్నర్ చేయడానికే అన్న చర్చ అయితే జరుగుతోంది. అయితే మూడు ప్రాంతాలను మూడు జోన్లుగా చేసి..స్పెషల్ బోర్డు..స్పెషల్ ఆఫీసర్లను కూడా పెట్టేందుకు అంతా సిద్ధమవుతోందట. అభివృద్ధి పనులు, పెట్టుబడులు, ప్రాజెక్టులపై ఎప్పటికప్పుడు ఫాలో అప్ చేస్తూ.. ప్రభుత్వం తీసుకున్న ప్రతి నిర్ణయం ఇంప్లిమెంట్ అయ్యేలా మాస్టర్ ప్లాన్ రెడీ చేస్తున్నారట. విశాఖ, అమరావతి, రాయలసీమను ఆర్థిక జోన్లుగా డివైడ్ చేసి..ప్రతీ జోన్‌కు మూడు కమిటీలు ఉండేలా ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు చెబుతున్నారు. విశాఖ జోన్‌లోకి ఉత్తరాంధ్రలోని 9 జిల్లాలు..అమరావతి జోన్‌లోకి 8 జిల్లాలు, రాయలసీమ జోన్‌లోకి 9 జిల్లాలు రాబోతున్నాయి. రాయలసీమ జోన్‌కు తిరుపతి కేంద్రంగా ఉండబోతోంది. మూడు ఎకనామిక్ జోన్లకు కలిపి సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఓ స్టీరింగ్ కమిటీ కూడా ఉండేలా వ్యూహరచన చేస్తున్నారట.అభివృద్ధి ఏ ఒక్క ప్రాంతానికో పరిమితం కాకూడదనేదే తమ ఆలోచన అంటున్నారు చంద్రబాబు. రాష్ట్రంలో మూడు ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ప్రకటించారు. రీజనల్ బోర్డులతో అభివృద్ధి అన్‌స్టాపబుల్‌గా కొనసాగుతుందని అంచనా వేస్తున్నారు. ఏపీలో గతంలో ఉన్న 13 జోన్ల వ్యవస్థను మార్చి, మూడు ప్రధాన జోన్లుగా చేయాలనే ప్రతిపాదన చర్చలో ఉంది. 2024 ఎన్నికల్లో టీడీపీ మ్యానిఫెస్టోలో ఈ అంశాన్ని ప్రస్తావించారుఇప్పుడు అమల్లోకి తెచ్చే ప్లాన్ చేస్తున్నారు. ఉత్తరాంధ్ర జోన్‌లో పోర్టులు, టూరిజం, ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్‌పై ఫోకస్ చేయనున్నారట. కోస్తా జోన్‌లో రాజధాని అమరావతి అభివృద్ధి, అగ్రికల్చర్, ఐ హబ్‌లు వంటి అంశాలు కీలకంగా కానున్నాయి. రాయలసీమ జోన్‌లో మ్యానుఫ్యాక్చరింగ్ సెక్టార్‌తో పాటు ప్రాజెక్టులు, ఇన్వెస్ట్‌మెంట్లను అట్రాక్ట్ చేసే వ్యూహం ఉందట. ప్రతి జోన్‌కు సెపరేట్ బడ్జెట్, మానిటరింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేస్తామంటోంది సర్కార్.పబ్లిక్ అటెన్షన్ గ్రాబ్ చేసేలా రీజనల్ బోర్డులపై టైమ్ చూసి లీకులు ఇచ్చారని అంటున్నారు. వైసీపీ మూడు రాజధానుల ఫార్ములా ఎలాగూ సక్సెస్ కాలేదు. కానీ కూటమి ప్రభుత్వం అమరావతి కేంద్రంగానే అభివృద్ధి చేస్తోందన్న విమర్శ ఉంది. అందుకే చంద్రబాబు రీజనల్ బోర్డుల ఏర్పాటుకు ప్లాన్ చేశారని అంటున్నారు. వైసీపీ మూడు రాజధానుల ఎజెండాకు కౌంటర్‌గా..జోన్ నినాదం ఎత్తుకున్నారని చెప్పుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమరావతిలో డెవలప్‌మెంట్‌ను స్పీడప్ చేశారు.రాజధాని పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలనే ఆలోచనలో ఉన్నారు. అయితే అమరావతి రాజధాని అభివృద్ధి చేస్తూనే ఏపీలో మూడు ప్రాంతాల ఈక్వల్‌గా డెవలప్ చేయాలన్న స్టాండ్‌తో బాబు ముందుకు రావడం హాట్ టాపిక్ అవుతోంది.ఏపీలో అమరావతిని మాత్రమే అభివృద్ధి చేసి మిగిలిన ప్రాంతాలను నిర్లక్ష్యం చేస్తున్నారని వైసీపీ విమర్శలు చేయకుండా..అపోజిషన్‌కు అసలు చాన్సే ఇవ్వొద్దన్న ఆలోచనతో బాబు ఉన్నారట. అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి..పెట్టుబడులు..ఒక్క మాటలో చెప్పాలంటే అభివృద్ధి వికేంద్రీకరణ అన్నట్లుగా రీజనల్ బోర్డులను తెస్తున్నారట. బాబు చెబుతున్న మూడు జోన్ల నినాదం ఏపీ రూపురేఖలను మారుస్తుందా లేదా అనేది వేచి చూడాలి.

# సినిమా..

### వి. శాంతారామ్ బయోపిక్‌లో హీరోయిన్‌గా

## తమన్నా.. ఫస్ట్ లుక్ రిలీజ్



భారతీయ సినిమా చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన పేరు, సుప్రసిద్ధ దర్శకుడు, నటుడు, నిర్మాత అయిన దిగ్గజ చలనచిత్రకారుడు వి. శాంతారామ్ జీవితం ఇప్పుడు వెండితెరపై ఆవిష్కృతం కానుంది. ఆయన అద్భుతమైన సినీ ప్రయాణం ఆధారంగా బాలీవుడ్‌లో ఒక భారీ బయోపిక్ నిర్మాణానికి రంగం సిద్ధమైంది. ఈ బయోగ్రాఫికల్ డ్రామాకు ఆయన పేరునే 'వి. శాంతారామ్'గా ఖరారు చేశారు మేకర్స్. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లో టైటిల్ పాత్ర (వి. శాంతారామ్ పాత్ర)లో ప్రముఖ బాలీవుడ్ యువ నటుడు సిద్ధాంత్ చతుర్వేది నటించబోతుండగా.. అభిజీత్ శిరీష్ దేశ్‌పాండే దర్శకత్వం వహించనున్నారు. ఇప్పటికే మూవీ నుంచి సిద్ధాంత్‌చతుర్వేది ఫస్ట్ లుక్‌ని విడుదల చిత్రబృందం తాజాగా క థానాయికను పరిచయం చేసింది. ఈసినిమాలోహీరోయిన్‌గా తమ న్నానటించ బోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భం గా తమన్నా భాటియా ఫస్ట్‌లుక్‌ని చిత్రబృందం విడుదల చేసింది.

ఈ బయోపిక్‌ను రాహుల్ కిరణ్ శాంతారామ్, సుభాష్ కాలే మరియు సరిత అశ్విన్ వర్దే సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం వి. శాంతారామ్ యొక్క అద్భుతమైన సినీ ప్రయాణాన్ని చూపించనుంది. సైలెంట్ యుగం (మూకీ సినిమాల కాలం) నుంచి టాకీలు (శబ్దంతో కూడిన సినిమాలు) ఆపై కలర్ సినిమా యుగం వరకు ఆయన చేసిన కృషి, దర్శకుడిగా, నిర్మాతగా ఆయన ఘనమైన ప్రస్థానాన్ని ఈ చిత్రం తెరకెక్కించనుంది.

శాంతారామ్ సినీ ప్రస్థానం: 1901నవంబర్ 18, 1901లో మహారాష్ట్రలోనికోల్హాపూర్‌లో జన్మించిన వి.శాంతారామ్ 1921లో నటుడిగా వెండితెరపై అడుగుపెట్టాడు. అనంతరం నటనతో పాటు మొత్తం 55కి పైగా సినిమాలకు దర్శకత్వం వహించాడు. ప్రభాత్ ఫిల్మ్ కంపెనీ (1929), రాజ్‌కమల్ కళామందిర్ (1942) లాంటి సంస్థలు స్థాపించి 92 సినిమాలకు పైగా నిర్మాతగా వ్యవహరించాడు. శాంతారామ్ సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం అతడిని దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు (1985), పద్మవిభూషణ్ (1992 మరణానంతరం) లతో సత్కరించింది.

## తరుణ్ భాస్కర్ 'ఓం శాంతి శాంతి శాంతి' టీజర్ చూశారా..!




దర్శకుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న టాలీవుడ్ యువ సంచలనం తరుణ్ భాస్కర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఓం శాంతి శాంతి శాంతి'. మలయాళంలో వచ్చిన జయ జయ జయ జయహే సినిమాకు రీమేక్‌గా రాబోతుంది ఈ చిత్రం. ఈ సినిమాకు ఏఆర్ సజీవ్ దర్శకత్వం వహిస్తుండగా.. సృజన్ యారబోలు, ఆదిత్య పిట్టే సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం డిసెంబర్ 23న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. కామెడీ కథాంశంతో ఈ సినిమా రాబోతుండగా ప్రస్తుతం టీజర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది.

## పూరి సేతుపతి ప్రాజెక్ట్‌లో రాధికా ఆప్టే




టాలీవుడ్ అగ్ర దర్శకుడు పూరి జగన్నాథ్ ప్రస్తుతం తమిళ నటుడు విజయ్ సేతుపతితో ఒక సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. పూరి సేతుపతి అంటూ ఈ ప్రాజెక్ట్ రాబోతుండగా.. 'పూరి కనెక్ట్స్' బ్యానర్ ఈ సినిమాను నిర్మిస్తుంది. ఈ ప్రాజెక్ట్‌లో బాలీవుడ్ నటి టబు ముఖ్య పాత్రలో నటించ బోతున్నట్లు ఇప్పటికే చిత్రబృందం వెల్లడించిం ది. అయితే తాజాగా ఈ ప్రాజెక్ట్‌కి సంబంధిం చి మరో కథానాయిక పేరు వినిపిస్తుంది. ఈ మూవీలో బాలీవుడ్ కథానాయిక రాధికా ఆప్టే నటించబోతున్నట్లు వార్తలు వస్తున్నా యి. అయితే రాధికా విజయ్‌కి జోడిగా నటిస్తుందా లేదా విలన్ పాత్రలో నటిస్తుందా తెలియాల్సి ఉంది. దర్శకుడు పూరి జగన్నాథ్, నటి చార్మి కౌర్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తుండగా.. ఈ చిత్రంలో విజయ్ సేతుపతిని ఇంతకు ముందెన్నడూ చూడని పాత్రలో చూపించనున్నట్లు పూరి జగన్నాథ్ ప్రకటించారు. ఈ సినిమా షూటింగ్ ఈ ఏడాది జూన్‌లో ప్రారంభమవుతుందని సమాచారం. 12లో ధోని చిత్రంతో తమిళంలోకి అడుగుపెట్టిన రాధికా ఆప్టే ఆ తర్వాత కబాలి, బాలకృష్ణ లెజెండ్ సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకుంది.

## ఫ్యాన్స్‌కి గుడ్ న్యూస్ చెప్పిన పూజా హెగ్డే..



ఒకప్పుడు టాలీవుడ్ టాప్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన పూజా హెగ్డే ఆ తర్వాత తెలుగులో అంతగా అవకాశాలని అందిపుచ్చుకోలేకపోయింది. దాదాపు స్టార్ హీరోలందరితో కలిసి నటించిన పూజా హెగ్డేకి ఇటీవలి కాలంలో టాలీవుడ్ ఆఫర్స్ లేవు. పూజా తెలుగులో సినిమా చేయక మూడేళ్లు అవుతుంది. పూజా హెగ్డేకి డీజే దువ్వాడ జగన్నాథం సినిమా మంచి గుర్తింపు తీసుకు రాగా, ఆ తర్వాత అల వైకుంఠపురములో అద్భుతంగా నటించి బుట్టబొమ్మగా అందరి మనసులలో నిలిచింది. పూజా నటించిన అరవిందసమేత వీరరాఘవ, మహర్షి లాంటి చిత్రాలు హిట్స్ కావడంతో పూజా టాలీవుడ్ టాప్ హీరోయిన్స్‌లో ఒకరిగా మారింది. అయితే మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ తర్వాత పూజా హెగ్డేకి ఒక్క హిట్ రాలేదు. రాధే శ్యామ్, ఆచార్య నిరాశ పరచగా డబ్బింగ్ మూవీ బీస్ట్‌తో పాటు హిందీ సినిమాలు సర్కస్, కిసీకా భాయ్ కిసీకా జాన్, దేవా సినిమాలు కూడా బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయి.

## ప్రపంచాన్ని చుట్టేయండి



ప్రముఖ నటి రష్మిక మందన్న తన సోషల్ మీడియా ఖాతా ద్వారా అభిమానులకు తన తాజా ట్రిప్ విశేషాలను పంచుకున్నారు. అందమైన ఫోటోలతో పాటు జీవితంపై స్ఫూర్తిదాయకమైన సందేశాన్ని కూడా పోస్ట్ చేశారు. తెల్లటి దుస్తులు ధరించి, తలలో తెల్లటి పువ్వు పెట్టుకున్న ఫోటోలను షేర్ చేస్తూ రష్మిక ఒక ఆసక్తికరమైన క్యాప్షన్ రాశారు. "ప్రపంచాన్ని చుట్టేయండి. అన్వేషించండి. తప్పులు చేయండి, మిమ్మల్ని మీరు క్షమించుకోండి. ప్రేమించండి. బిగ్గరగా నవ్వండి. సంతోషంగా జీవించండి. మీ జీవితాన్ని, ఇతరులను, మిమ్మల్ని మీరు గౌరవించుకోండి. దయతో ఉండండి" అంటూ తన ఫ్యాన్స్‌కు స్ఫూర్తినిచ్చారు. ఇటీవల రష్మిక నటించిన 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రం విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ సినిమాపై బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ ప్రశంసలు కురిపించారు.

సినిమాలోని ఒక కీలక సన్నివేశాన్ని షేర్ చేస్తూ "తప్పక చూడాల్సిన సినిమా" అని పేర్కొన్నారు. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో వచ్చిన ఈ రొమాంటిక్ డ్రామాలో రష్మిక నటనకు విమర్శకుల నుంచి మంచి మార్కులు పడ్డాయి. రష్మిక అప్పుడప్పుడు తన పోస్టులతో అభిమానులను ఆలోచింపజేస్తుంటారు. కొన్ని రోజుల క్రితం 'ఫెమినిన్ ఎనర్జీ' గురించి ఆమె చేసిన పోస్ట్ కూడా బాగా వైరల్ అయింది. మహిళలు ఒకరికొకరు తోడుగా నిలిస్తే అద్భుతాలు చేయగలరని, వారి శక్తి అన్‌స్టాపబుల్ అని ఆమె ఆ పోస్టులో అభిప్రాయపడ్డారు.

## స్టెప్పేస్తే భూకంపం అంటున్న ఉస్తాద్ భగత్ సింగ్..



పవన్ కల్యాణ్ టైటిల్ రోల్ పోషిస్తున్న చిత్రం ఉస్తాద్ భగత్ సింగ్. హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో శ్రీలీల ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. రాశీఖన్నా కీ రోల్ పోషిస్తోంది. లీడింగ్ ప్రొడక్షన్ హౌజ్ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ మూవీ నుంచి ఇప్పటికే విడుదలైన ఫస్ట్ గ్లింప్స్ సినిమా ఏ రేంజ్‌లో ఉండబోతుందో హింట్ ఇచ్చేసింది. ముందుగా ప్రకటించిన ప్రకారం మేకర్స్ ఈ మూవీ ఫస్ట్ సింగిల్ దేఖ్ లేంగే సాలా ప్రోమోను లాంచ్ చేశారు. దేవీ శ్రీ ప్రసాద్ కంపోజ్ చేసిన ఈ పాటను భాస్కర బట్ల రాయగా.. విశాల్ దడ్లానీ పాడాడు. పవన్ కల్యాణ్‌లోని స్టైలిష్ అవతార్‌ను మరోసారి సిల్వర్ స్క్రీన్‌పై చూపించబోతున్నట్టు ప్రోమో చెప్పేస్తుంది. రంపంపం రంపంపం స్టెప్పేస్తే భూకంపం అంటూ పవన్ కల్యాణ్ వేసే స్టైలిష్ స్టెప్పులు స్టేజ్ షేక్ అవడం గ్యారంటీ అని ప్రోమో చెబుతోంది. ఇక తమ అభిమానహీరో మ్యానరిజాన్ని చూసిన అభిమానులు ఫుల్ ఖుషీ అవుతూనే.. పూర్తి సాంగ్ కోసం ఎదురుచూస్తున్నారు. భగత్.. భగత్ సింగ్ మహంకాళి పోలీస్‌స్టేషన్, పత్తర్ గంజ్, ఓల్డ్ సిటీ. ఈ సారి పర్ ఫార్మన్స్ బద్దలైపోద్ది.. అంటూ ఉస్తాద్‌భగత్ సింగ్‌లోతనదైన మ్యానరిజంతో సాగుతున్న పవన్ కల్యాణ్ డైలాగ్స్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నాయి. గబ్బర్ సింగ్ లాంటిబ్లాక్ బస్టర్‌కాంబినేషన్‌లో వస్తున్న సినిమాకావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఈచిత్రాన్ని మార్చి 26న- 2026కు విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు.

## మహేష్ బాబుకి జక్కన్న టార్చర్ స్టార్ట్ 'వారణాసి' కోసం ఏకంగా 5 గెటప్స్!

టాలీవుడ్‌లో రాజమౌళితో సినిమా చేయాలని కోరుకోని హీరో ఉండరు. ఆయన సినిమాలు అంటే గ్లోబల్ రేంజ్, అంతర్జాతీయ గుర్తింపు గ్యారంటీ. అయితే ఆ క్రేజ్ వెనుక ఉన్న కఠినమైన కృషి గురించి ఇండస్ట్రీకి బాగా తెలుసు. పర్ఫెక్షన్ కోసం నటీనటులను పిండేయడమే జక్కన్న స్టైల్. ఇదే విషయాన్ని గతంలో ప్రభాస్, ఎన్టీఆర్, రామ్ చరణ్ సరదాగా పలుమార్లు చెప్పిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పుడు అదే దశలోకి సూపర్ స్టార్ మహేష్ బాబు అడుగుపెడుతున్నారు. రాజమౌళి–మహేష్ బాబు కాంబినేషన్‌లో రూపొందుతున్న 'వారణాసి' సినిమాపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇది మహేష్ కెరీర్‌లోనే కాకుండా రాజమౌళి ఫిల్మోగ్రఫీలో కూడా మరో భారీ ప్రాజెక్ట్‌గా తయారవుతోంది. ఇప్పటికే బయటికొచ్చిన సమాచారం ప్రకారం, మహేష్ బాబు ఈ సినిమాలో ఏకంగా 5 విభిన్న అవతారాల్లో కనిపించబోతున్నారట. అందులో రాముడు, రుద్రుడు కీలక పాత్రలుగా ఉండగా, మిగిలిన మూడు పాత్రలు కూడా కథకు ముఖ్యమైన వేరియేషన్స్ అన్న టాక్ ఇండస్ట్రీలో వినిపిస్తోంది. ఇన్నేళ్ల కెరీర్‌లో మహేష్ బాబు ద్విపాత్రాభినయం కూడా చేయలేదు.

అలాంటిది ఇప్పుడు ఒక్కసారిగా ఐదు పాత్రలు అంటే ఇది చిన్న విషయం కాదు. ప్రతి పాత్రకు భిన్నమైన బాడీ లాంగ్వేజ్ ఉంటుంది. వాయిస్ మాడ్యులేషన్, మైండ్‌సెట్, ఎమోషనల్ రేంజ్ ఇవి అన్నింటినీ పర్ఫెక్ట్‌గా చేయాల్సి వస్తోంది. రాజమౌళి ఒకే సీన్ కోసం వంద టేకులు తీస్తారనే విషయాన్ని ఇండస్ట్రీ బాగా తెలుసు. ఇప్పుడు ఐదు పాత్రలు ఉంటే మహేష్ బాబు పడాల్సిన కష్టం ఎలా ఉంటుందో అని మహేష్ ఫ్యాన్స్ ముచ్చటించుకుంటున్నారు.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215